
వార్త
ఆదివారం
19 మే, 2024
అతివకు
అందలం

## రవికిరణ్ కోలా దర్శకత్వంలో విజయ్ దేవరకొండ



ఈమధ్యే 'ఫ్యామిలీ స్టార్' సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న టాలీవుడ్ విజయ్ దేవరకొండ రవికిరణ్ కోలా దర్శకత్వంలో నటించనున్నట్లు తెలుస్తోంది. పొలిటికల్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు సమాచారం. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణ సంస్థపై దిల్‌రాజు నిర్మించనున్నారు. రవికిరణ్ కోలా తొలి సినిమా 'రాజావారు రాణివారు'తో హిట్ అందుకున్నారు.

## 'మన్మథుడు' హీరోయిన్ రీ ఎంట్రీ?



'మన్మథుడు' సినిమాతో అన్షు అందరికీ ఫేవరేట్ హీరోయిన్‌గా మారిపోయారు. ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన 'రాఘవేంద్ర' సినిమాలోనూ హీరోయిన్‌గా నటించింది అన్షు. అన్షు ఇప్పుడు రీ ఎంట్రీ ఇవ్వనున్నట్లు తాజా సమాచారం.

సందీప్ కిషన్ హీరోగా, డైరెక్టర్ త్రినాథ్ రావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎస్‌కె 30 సినిమాలో ఒక కీలక పాత్ర కోసం ఈమెను తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో కథానాయిక ఎవరన్నది ఇంకా తెలియాల్సి వుంది. సందీప్ కిషన్ టాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు.

ఆదివారం వార్త

19 మే, 2024

## మంచి ముత్యాలు

తల్లి శరీరాన్ని పోషించి పెంచుతుంది. ఉత్తమ గ్రంథం హృదయాన్ని పోషించి పెంచుతుంది.

- రావూరు సత్యనారాయణరావు

## విషయ విశేషం

చలువ అద్దాలు... 4

'సంఘీ'భావం....5

భూములపై ప్రయోగాలతో ఆందోళన

కవర్ స్టోరీ..6

అతివకు

అందలం

విజయబాటలో...11

ఈవారం కవిత్వం..12

నేనెందుకు చదువుతాను?

డిప్రెషన్‌తో 'ఢీ'!...14

కథ.. 20

వాయుగుండం

సాహిత్యం..23

కడగండ్ల కడలిలో తెలుగు

ధర్మసంకటం...24

జగమంత కుటుంబం నాది..25

ఆంధ్రాలో చూడదగ్గ స్థలాలు...26

సెల్లార్ పైకప్పు ఎంత ఎత్తులో ఉండాలి?...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### జూదాన్ని మాన్పించే మందు



క్రికెట్ బెట్టింగో, కోడిపందేలో, పేకాటో జూదాలకి అంతేలేదు. కుటుంబం వీధినపడటం నుంచీ జైలుకెళ్లేదాకా..వాటివల్ల ఎన్ని సమస్యలు వచ్చినా జూదం మానరు చాలామంది. మానసిక నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించడమే ఇప్పటిదాకా వీళ్లకున్న చికిత్స. ఇకపైన మందులూ ఇవ్వొచ్చంటోంది తాజా పరిశోధన ఒకటి. ఇంగ్లండులోని సదరన్ హెల్త్ ఎన్‌హెచ్‌ఎస్ ఫౌండేషన్‌కి చెందిన శాస్త్రవేత్తలు దీనిపై చేసిన పరిశోధనలో మాదకద్రవ్యాల బాధితులకి వాడే మందులు జూదరులపైనా పని చేస్తున్నాయని తేల్చారు. మామూలుగా హెరాయిన్‌లాంటి మాదకద్రవ్యాలు మన మెదడులోని కొన్ని నాడుల్ని ప్రేరేపిస్తాయి. వాటిని 'ఓపీఆయిడ్ రిసెప్టర్స్' అంటారు. ఈ నాడులు మనల్ని ఆనందంలో ఓలలాడించే డోపమైన్ విడుదలకి కారణమవుతాయి. జూదంలో ఉండే ఉత్కంఠ, ఓడిపోతే పెరిగే పట్టుదల, గెలిస్తే మనం అదృష్టవంతులమన్న ఆనందం..ఇవి కూడా 'ఓపీఆయిడ్ రిసెప్టర్స్'ను ప్రేరేపించి డోపమైన్‌ను విడుదల చేస్తుండొచ్చని అనుమానించారు శాస్త్రవేత్తలు. అందుకే మాదకద్రవ్యాల బాధితులకు వాడే నాల్మెఫీమ్, నాల్‌ట్రెక్సోన్ మందుల్ని జూదంపైన మోజున్నవాళ్లకి ఇచ్చారు. వాటిని వాడిన వాళ్లలో చాలావరకూ జూదం పైన కోరిక తగ్గినట్లు గమనించారు. ఈ ఫలితాలతో మరింత పెద్ద స్థాయిలో క్లినికల్ ట్రయల్స్‌కి వెళతామంటున్నారు శాస్త్రవేత్తలు.

### జోక్స్..జోక్స్..

వెర్రివెంగళప్ప: అసలు నాకు తెలీక అడుగుతున్నా దెయ్యాలకి తెల్లబట్టలు ఎవరు ఉతుకుతారు? అంత తెల్లగా ఎలా ఉంటాయి ఏ సబ్బు అది?

...

అమెరికాలో కరెంటు పోతే, వాళ్లు కరెంట్ ఆఫీస్‌కి ఫోన్ చేస్తారు.
జపాన్‌లో కరెంటుపోతే వాళ్లు మొదట ఫ్యూజ్ చెక్‌చేస్తారు.
అదే మనదేశంలో కరెంటుపోతే పక్కింట్లో చెక్ చేస్తాం 'ఓహో..అందరింట్లో పోయిందా..ఐతే ఒకే..'

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com





# చలువ అద్దాలు









ఎండలు మండిపోతున్నాయి. బయటికి వెళ్లాలంటే చలువ అద్దాలు పెట్టుకోవాల్సిందే. నలుపు, ముదురు ఎరుపు ఛాయల్లో ఉండే చలువటద్దాల చుట్టూ ముత్యాలను అతికిస్తే ఎంత బాగుంటాయో! స్టైలిష్ లుక్‌లో తళుక్కుమనొచ్చు. ఇక, కాస్త పంకీ స్టైల్‌లో కనిపించాలనుకుంటే..లెటర్స్‌ప్రింట్‌తో చేసిన కలర్ బీడ్స్‌ని మీకు నచ్చినట్లుగా అద్దాల చుట్టూ అతికించేయండి. సంగీత్, మెహందీ వంటి కార్యక్రమాలకూ, బీచ్‌లకూ వెళ్లినప్పుడూ..ఇవి మీకు కొత్త అందం తెచ్చిపెట్టడంతో పాటు అందరిలో ప్రత్యేకంగా కనిపించేలా చేస్తాయి.





'సంఘీ' భావం



# భూములపై ప్రయోగాలతో ఆందోళన

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు చెందిన ఆస్తుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. తెలంగాణాలో ధరణి పోర్టల్‌పై ఇప్పటికే పలు అనుమానాలు రావడంతో విచారణ కమిటీకి కూడా ఆదేశించడం జరిగింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ల్యాండ్ టైట్లింగ్ చట్టం కూడా వివాదానికి దారి తీసింది. ముఖ్యంగా ఆంధ్రలో ఎన్నికల పోలింగ్‌కు ముందు ఈ అంశం కీలకంగా మారింది. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని ప్రచారం చేయగా, చట్టంలో లోపాలు లేవు ప్రజల ఆస్తులకు మరింత భద్రత ఏర్పడుతుందని అధికారపక్షం వివరణ ఇవ్వవలసిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణలో భూములను క్రమబద్ధం చేసే ఉద్దేశ్యంతో ధరణి పోర్టల్‌ను అమలులోకి తీసుకువచ్చింది. అయితే క్షేత్ర స్థాయిలో అనేక ఇబ్బందులు తలెత్తాయి. రైతులు, ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. భూమి ఉన్న వారి వివరాలు ధరణి పోర్టల్‌లోకి రాలేదు. అదేవిధంగా ఎటువంటి భూమి లేని వారి పేర్లు పోర్టల్‌లో కనిపించాయి. మరికొందరి పేర్లు తప్పుగా నమోదు అయ్యాయి. పంపకాలు జరిగిన భూమికి సంబంధించి వివరాలు సమగ్రంగా నమోదు కాలేదు. అదేవిధంగా నాలుగు ఎకరాలు ఉన్న రైతు దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటూ ఉండగా ధరణి పోర్టల్‌లో రెండు ఎకరాలుగా చూపించింది. దీనితో రైతులు, ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, రిజిస్ట్రేషన్ అధికారుల చుట్టూ తిరగ వలసి వచ్చింది. అయినా వారికి సరైన సమాధానాలు, పరిష్కారం లభించలేదు. దీనితో భూమి యజమానులు ఆందోళనకు గురయ్యారు. తమ సమస్యను ఎవరికి విన్నవించుకోవాలో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ధరణిపై దృష్టి సారించింది. దీనిపై కోదండ రెడ్డి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించి లోపాలు సరిదిద్దే కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఇది మరికొంతకాలం కాలయాపన జరిగే పరిస్థితి ఉంది. ఈ సమయంలో భూములు విక్రయించుకోవాలన్నా, కొనుగోలు చేయాలన్నా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా రైతులు పంటలు వేసే సమయంలో బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు తీసుకుంటారు. అయితే ధరణిలో వారి పేర్లు లేకపోవడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. దీనితో అన్నదాతలు రుణాల కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి పెద్ద మొత్తంలో వడ్డీ చెల్లించే దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి ఎప్పుడు మెరుగు అవుతుందో తెలియక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టం పూర్తి స్థాయిలో అమలుకాకపోయినా అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. సరిగ్గా ఎన్నికల సమయంలో ఈ అంశం తెరపైకి రావడంతో మరింత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఇళ్లు, భూములు, పొలాలు ఉన్నవారు తమ ఆస్తుల విషయంలో ఆందోళనకు గురౌతున్నారు. ముఖ్యంగా భూమి, స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు ప్రభుత్వమే ఉంచుకుని జెరాక్స్ కాపీలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొనడంతో ఆందోళన మరింత ఎక్కువైంది. పైగా ఈ రిజిస్ట్రేషన్ కార్యక్రమానికిసంబంధించి ప్రభుత్వ అధికారి ఆధీనంలో కాకుండా ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. దీనితో తమ ఆస్తులపై మరింత ఆందోళన ఎక్కువైంది. ఒరిజనల్ డాక్యుమెంట్లు తమ వద్ద ఉంటేనే నకిలీవి తయారుచేసి అక్రమాలకు పాల్పడుతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ తరుణంలో జెరాక్స్ కాపీలు ఇస్తే వాటిని మరికొన్ని కాపీలు తీసుకోవడం మరింత సులువుగా మారింది. దీనితో తమ ప్రమేయం లేకుండానే తమ ఆస్తులు పరాయిపాలు అయ్యే ప్రమాదం ఉందని యజమానులు భయపడుతున్నారు. పైగా బ్యాంకుల్లో రుణం తీసుకునే సమయంలో మరిన్ని ఇబ్బందులు ఉంటాయి. బ్యాంకులు జాతీయ స్థాయిలో నిబంధనలు అమలుచేయడం వల్ల రాష్ట్రంలో అదేవిధానాన్ని అమలుచేస్తారు. దీనితో ఒరిజనల్ డాక్యుమెంట్లు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు అయితే రుణాలు అందడం సమస్యగా మారుతుంది. ప్రభుత్వం పేర్కొంటున్న ప్రకారం బ్యాంకుల నుంచి రుణాలు పొందే ముందు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సమాచారం అందిస్తే అక్కడి నుంచి బ్యాంకులు డాక్యుమెంట్లు అందిస్తామని చెబుతున్నారు. దీనిపై కూడా పూర్తిస్థాయి క్లారిటీ లేదు. ప్రస్తుతం రుణం కోసం బ్యాంకు చుట్టూ పదిసార్లు తిరగాల్సి ఉంటుంది. ఇక రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ కూడా మరికొన్ని రోజులు తిరగక తప్పని పరిస్థిత ఎదురౌతుందని యజమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పైగా భూముల విషయంలో ఏదైనా వివాదాలు వస్తే స్థానిక సివిల్ కోర్టును ఆశ్రయించి సమస్య పరిష్కారం చేసుకునే వారు. కొత్త చట్టం ప్రకారం ట్రిబునల్‌కు గాని, హైకోర్టుకు గాని వెళ్లవలసి ఉంటుంది. మధ్యతరగతి కుటుంబాలు, చిన్న కారు, సన్నకారు రైతులు హైకోర్టుకు వెళ్లాలంటే ఆర్థికంగాను, సమయం పరంగానే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది. ఇప్పటికే పలు దశల్లో పరిశీలనలు జరిపి, కేంద్ర ప్రభుత్వానికి బిల్లు పంపించి ఆమోదం పొందినట్లు ప్రభుత్వం పేర్కొంటోంది. సమస్యల పరిష్కారం విషయంలో తగిన వివరణ లేకుండా చట్టాన్ని అమలుచేసే ప్రయత్నం చేయడం సరికాదని రైతులు, భూముల యజమానులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా రెండు తెలుగు రాష్ట్రాల్లో భూముల విషయంలో జరుగుతున్న సంస్కరణలు సామాన్యులకు ఇబ్బందులు తెచ్చే విధంగా తయారయ్యాయని రియల్ ఎస్టేట్‌రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# అతివకు అందలం

**కవర్‌స్టోరీ**

**సుంకవల్లి సత్తిరాజు**


**మదిలో** మెదిలిన చిన్నచిన్న ఆలోచనలే దీర్ఘకాలంలో పెనువిప్లవానికి దారితీస్తాయి. లక్ష్యానికి చేరువచేస్తాయి. సత్ఫలితాలను ప్రసాదిస్తాయి. మనసులో గూడుకట్టుకున్న ఆలోచనలకు ఆచరణ రూపం ఇవ్వకుండా మొగ్గలోనే తుంచేసి, ఊహలకొచ్చిన రెక్కలను కత్తిరించేసి, ఎగరాలనుకోవడం, ప్రయత్నం లేకుండా ఫలితాలను ఆశించడం అత్యాశేకాగలదు. ఆశించడం తప్పుకాదు. ఆశకు తగ్గ ప్రయత్నం చేయకుండా మనం అనుకున్నవన్నీ జరిగిపోవాలనుకోవడంలో ఔచిత్యం లేదు. ఆశావహదృక్పథం అలవరచుకోవాలి. మన ఆలోచనకు క్రియా రూపం ఇవ్వాలి. గాఢాంధకారంలో చిరువెలుగు కోసం ప్రయత్నించాలి. ఆ వెలుతురులోనే మన గమ్యానికి మార్గం అన్వేషించాలి. ఈ అన్వేషణాక్రమంలో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. మనం నడిచేదారిలో ఎన్నో ముళ్లుంటాయి. మన ఆశల రెక్కలను కత్తిరించడానికి యత్నించే ఎన్నో కుటిల శక్తులుంటాయి. ఎన్నో అవరోధాలు ఎదురవుతాయి. మనం నడిచే దారి పూలదారి కావాలనుకోవడం, అవాంతరాలెదురైతే లక్ష్యాన్ని ఛేధించకుండా పలాయనం చిత్తగించడం కార్యశూరుల లక్షణం కాదు. సాధించాలన్న సంకల్పం బలీయంగా ఉంటే ఛేధించడం కష్టసాధ్యం కాదు. సమస్త భూగోళంపై తమదే గుత్తాధిపత్యమన్న అహంభావంతో మానవత్వం మరచి, స్వేచ్ఛను హరించి, దమన నీతితో దౌర్జన్యంగా భారతదేశాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుని, సుదీర్ఘకాలం వలసపాలన సాగించిన ఆంగ్లమత్తేభాల మదమణచి, రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్య పాలనాసౌధాల పునాదులను పెకలించిన ధీరత్వం భారతజాతి స్వంతం. స్వాతంత్ర్యసంగ్రామ మహాక్రతువులో తాము సైతం తక్కువ కాదని, స్వేచ్ఛపై మక్కువతో ఆంగ్లపాలకులను ఎదురించిన భారతీయ ధీరవనితల త్యాగశీలతను తక్కువగా అంచనా వేయరాదు.

ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీ నాయుడు, అరుణా అసఫాలీ, విజయలక్ష్మీ పండిట్, కమలా దేవీ ఛటోపాధ్యాయి, కెప్టెన్ లక్ష్మీ సెహగల్, సరళాదేవి, ఉషామెహ్రావంటి ధీరోదాత్త మహిళల నిరుపమాన ధైర్యసాహసాలు స్వాతంత్ర్య ఫలసిద్ధిలో ప్రతిభావంతమైన పోషించడం జరిగింది. మహిళల త్యాగాలను మహిళలే మరచిపోవడం, ఉద్యమాలకు ఊపిరిపోయడంలో అలసత్వం ప్రదర్శించడం వలన నేటికీ భారతీయ సమాజంలో మహిళలు ద్వితీయశ్రేణి తరగతి ప్రజలగానే పరిగణింపబడుతు న్నారు. మహిళలు తమ శక్తిసామర్థ్యాలను తక్కువగా అంచనా వేయడం వలన మహిళలపై నేటికీ వివక్షత కొనసాగుతున్నది. గతంలో కంటే మహిళల సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులు కొంతవరకూ మెరుగుపడినా, ప్రతిభకు కొదవలేకపోయినా పలు కారణాల రీత్యా భారతీయ సమాజంలో ఇంకా 'స్త్రీ' పురుషులతో పోల్చి చూస్తే వెనుకబడి ఉన్నదనే చెప్పాలి. లింగవివక్షత వర్తమాన సమాజంలో ఇంకా కొనసాగుతూనే ఉన్నది.

రాజకీయరంగంలో నిలదొక్కుకుని రాణిస్తేనే మహిళలు పురుషులతో సమానంగా సమాజంలో గౌరవించబడగలరనే భావన పెరిగింది. చట్టసభల్లో మగువగొంతు మార్మోగితేనే లింగవివక్షత అంతమవుతుందనే వాదన సర్వత్రా వినబడుతున్నది. మాకెందుకులే అని మూలన కూర్చుంటే మహిళలు ఇన్నిరంగాల్లో రాణించేవారా? మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా, ప్రధానులుగా, రాష్ట్రపతులుగా చరిత్ర సృష్టించేవారా? ఒక్కక్షణ ఆలోచించాలి. అంతర్మథనం జరగాలి. మహిళా ప్రపంచం మేథోమథనం జరపాలి. చట్టసభల్లో ప్రవేశించి మహిళల స్థానం మెరుగు పరచాలి. దేశాభ్యున్నతిలో మహిళా ప్రాధాన్యం కోసం ఎలుగెత్తిన గళాలు చాలావరకు విజయం సాధించాయి. నెమ్మదిగా ప్రారంభ మైన మహిళా రిజర్వేషన్ల ఉద్యమం తారాస్థాయికి చేరింది. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందింది. అయితే అనివార్య కారణాల వలన చట్టసభల్లో మహిళల రిజర్వేషన్లు అమలు కావడానికి 2029 లోక్‌సభ ఎన్నికల వరకు వేచి చూడకతప్పదు. గతంలో మహిళల రిజర్వేషన్ల గురించి గత సంవత్సరం 'మహిళకు పట్టం' పేరుతో వార్త ఆదివారం కవర్‌స్టోరీలో విపులంగా వివరించడం జరిగింది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో పార్లమెంటు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ల బిల్లు అమలు కాకపోయినప్పటికీ, ఆయా రాజకీయ పార్టీల తరపున పోటీ చేస్తున్న మహిళలను ఎన్నికల్లో తలపడుతున్నందుకు ప్రశంసిస్తూ

ప్రోత్సహించాలి. ప్రస్తుతం ఏడుదశలో, జరుగుతున్న లోక్‌సభ, నాలుగు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో మహిళల ప్రాతినిధ్యం గురించి, మహిళలకు కేటాయించబడ్డ సీట్ల సంఖ్య గురించి, గతానికి, వర్తమానానికి చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యానికి సంబంధించిన వివరాల గురించి చర్చిద్దాం. మగువుల మనుగడ గురించి సభలు సమావేశా ల్లో గొంతెత్తి అరిచి రాజకీయ నాయకులు నిజంగా చట్టసభల్లో మహిళల ప్రాతినిథ్యం పెరగానికి చిత్తశుద్ధి ప్రదర్శించారా? మలిదశలో ప్రదర్శించగలరా? అనే విషయాలను గురించి సవివరంగా తెలుసుకోవాలి. లోక్‌సభకు ప్రతీ ఐదుసంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరగాలని భారత రాజ్యాంగం నిర్ధేశించిన క్రమంలో 18వ లోక్‌సభకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల ద్వారా 543 మంది అభ్యర్థులను పార్లమెంటు దిగువ సభకు పంపవలసి ఉంటుంది. ఆధునిక యుగంలో ఇంకా లింగవివక్షత కొనసాగుతున్న నేపధ్యంలో మహిళలు కూడా రాజకీయ అధికారం ద్వారా పురుషాధిక్య సమాజంలో నిలదొక్కుకుని జీవించాలని ఆశించడం అత్యాశకాబోదు. ఇది ఒక అవసరం. ప్రాధాన్యత గల అంశం కూడా. ఏడు దశల ఎన్నికల అంకంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో పోటీపడిన మహిళా అభ్యర్థుల శాతం తక్కువగా ఉన్నట్టు ప్రాథమిక అంచనాలబట్టి తెలుస్తున్నది. మొదటి, రెండవ దశలో 2823 మంది అభ్యర్థులు వివిధ పార్టీల నుండి పోటీ చేయగా, మరికొంతమంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయడం జరిగింది. ఇందులో కేవలం 234మంది మహిళలు మాత్రమే పోటీపడడం, మహిళా అభ్యర్థులు 8శాతం దాటకపోవడం దురదృష్టకరం. మొదటి దశలో పోటీపడ్డ మొత్తం 1625 మంది అభ్యర్థుల్లో మహిళల సంఖ్య కేవలం 135 కావడం శోచనీయం. తమిళనాడులో మొత్తం పోటీలో నిలబడ్డ అభ్యర్థుల్లో 76మంది మహిళలు వీరిలో నిలబడి మొదటిదశ ఎన్నికల్లో అగ్రస్థానంలో నిలిచారు. రెండవదశలో 1198మంది అభ్యర్థులకుగాను మహిళా అభ్యర్థులు కేవలం 100మంది మాత్రమే. కేరళలో రెండవదశ ఎన్నికల్లో పోటీ చేయడం జరిగింది. 3వ దశలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 1352 మంది అభ్యర్థుల్ల పోటీపడ్డ మహిళలు 123 మంది. ఇది కేవలం 9శాతం మాత్రమే. 4వ దశలో పోటీపడ్డ 1717 మంది అభ్యర్థుల్లో కేవలం 10శాతం అనగా 170మంది మహిళలున్నారు. 42 లోక్‌సభ స్థానాలు గల పశ్చిమబెంగాల్లో మమతాబెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ 12మంది మమిళలను లోక్‌సభ అభ్యర్థులుగా ప్రకటించింది. భారతప్రధాన ఎన్నికల అధికార రాజీవ్‌కుమార్ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన సందర్భంలో 140 కోట్ల జనాభా గల భారతదేశంలో సుమారు 96.8కోట్ల మంది ప్రజలు ఓటు వేయడానికి అర్హులని, ఇందులో పురుష ఓటర్లు 49.72 కోట్లు, స్త్రీ ఓటర్ల సంఖ్య 47.1కోట్లని చెప్పడం జరిగింది. 12 రాష్ట్రాలు, కొన్ని కేంద్ర పాలిత ప్రాంతాల్లో మహిళా ఓటర్ల సంఖ్యే అధికంగా ఉండడం గమనార్హం. 85లక్షలమంది మహాళా ఓటర్లు కొత్తగా ఈ ఎన్నికల్లో ఓటు వేయనున్నారు. 948 స్త్రీలకు 1000మంది పురుషులుగా లింగ నిష్పత్తి ఉంది.

2029 నాటికి మహిళా ఓటర్ల సంఖ్య పురుషులను అధిగమించే అవకాశాలున్నాయి. భారతీయ ఎన్నికల వ్యవస్థలో మహిళలకు ఇదొక మంచి అవకాశం. 1957 లోక్‌సభ ఎన్నికల్లో కేవం 45 మంది మహిళలు పోటీ చేయగా 2019 నాటికి ఈ సంఖ్య గణనీయంగా పెరిగి 726కి పెరిగింది. పార్లమెంటులో మహిళల శాతం 4.5శాతం నుండి 2019 నాటికి 14.4శాతానికి పెరిగింది. 17వ లోక్‌సభలో దేశంలో 82మంది మహిళలు ప్రాతినిధ్యం పొందారు. వీరిలో 5గురు మహిళలు వివిధ కారణాల రీత్యా రాజీనామా చేసారు. లెజిస్లేటర్లు ఎన్నుకునే 238 రాజ్యసభ సభ్యుల్లో 33 మహిళలున్నారు. ఇది 15శాతం కంటే తక్కువ. 17వలోక్‌సభ ఎంపీలలో 15శాతం రాజ్యసభ ఎంపీలలో 13శాతం మంది మహిళలున్నారు. లోక్‌సభలో 42శాతం బిజూ జనతాదళ్ ఎంపీలు, 39శాతం తృణమూల్ ఎంపీలు మహిళలే కావడం విశేషం. బిజూ జనతాదళ్ పార్టీ మహిళలకు 33శాతం సీట్లు కేటాయించాలనే నిబంధనతో మహిళల ప్రాధాన్యత పెంచింది. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీలలో 17శాతం మంది మహిళలున్నారు. 2019 ఎన్నికల్లో బిజెపి 32.2శాతం, కాంగ్రెస్ 31.6శాతం మహిళా అభ్యర్థులను రంగంలోకి దించింది. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో ఘనత తనదేనంటూ చెప్పుకుంటున్న బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు అనుకున్నత ప్రాధాన్యత నివ్వలేదని సునిశితంగా పరిశీలిస్తే అవగతమవుతుంది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం విషయంలో దాదాపుగా అన్ని రాజకీయ పార్టీల్లో చిత్తశుద్ధి లోపించడం 2024లో ఏ పార్టీ ఎక్కువమంది మహిళా అభ్యర్థులను పోటీకి నిలబెట్టిందో తెలియాలంటే 7వ దశ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసేవరకు వేచి చూడాలి. అత్యధికంగా 80లోక్‌సభ స్థానాలు గల ఉత్తరప్రదేశ్‌లో అమేథి నుంచి బిజెపి మహిళా అభ్యర్థిగా స్మృతి ఇరానీ తిరిగి పోటీ చేస్తున్నది. గత లోక్‌సభ ఎన్నికల్ల రాహుల్‌గాంధిపై స్మృతిఇరానీ గెలుపొందారు. అనారోగ్య కారణాల వలన సోనియాగాంధ అధ్యక్ష బాధ్యతల నుండి తప్పుకుని రాజస్థాన్ నుండి రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఆమె దాదాపుగా ప్రత్యక్ష రాజకీయల నుండి తప్పుకున్నట్లే. ఆమె గతంలో ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీ గెలుపొందిన విషయం విదితమే. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 4.14 కోట్లమంది ఓటర్లుండగా 2.10 కోట్లమంది మహిళా ఓటర్లున్నారు. రాష్ట్రంలోని 25లోక్‌సభ స్థానాలకుగాను మొత్తం 545 మంది అభ్యర్థులు పోటీ పడుతుం డగా, 175 అసెంబ్లీ స్థానాలకుగాను, 2300మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రస్తుతమున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 14మంది మహిళా ఎమ్మెల్యేలున్నారు. శాసనమండలి లో నలుగురు మహిళలున్నారు. శాసనసభలోని 14మంది మహిళా ఎమ్మెల్యేల్లో ప్రస్తుతం విడుదల రజని, తానేటి వనతి, ఉషాశ్రీ చరణ్, రోజా మంత్రులుగా ఉన్నారు. 2014లో చంద్రబాబు క్యాబినెట్లో పరిటాల సునీత, పీతల సుజాత, కిమిడి మృణాళినిలు మంత్రులుగా పనిచేసారు. అధికారంలో ఉన్న వైసిపి ప్రధాన ప్రతిపక్షమైన



కొండాసురేఖ సీతక్క

తెలుగుదేశం తరపున పోటీపడే మహిళల గెలుపుపై ఆసక్తి నెలకొన్నది. ఆంధ్రప్రదేశ్‌లో ఎంపి, ఎమ్మెల్యే ఎన్నికలు పురంధేశ్వరి, వైఎస్ షర్మిల, కొత్తపల్లి గీత, తానేటి వనిత, సుచరిత, వంగలపూడి అనిత, పుష్పశ్రీవాణి, రోజా తదితరుల తలరాతలను నిర్దేశించనున్నాయి. మంగళగిరిలో నారాలోకేష్‌పై హిందూపూర్‌లో బాలకృష్ణపైన, పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌పైన పాలక వైసిపి మహిళా అభ్యర్థులను నిలిపింది. కడప అసెంబ్లీ అభ్యర్థిగా బలమైన మహిళా నాయకురాలు రెడ్డప్పగారి మాధవి, ఆళ్లగడ్డ నుండి భూమా అఖిలప్రియ పోటీలో ఉన్నారు. విశాఖపట్నం ఎంపి స్థానం నుంచి బొత్సా ఝాన్సీ సినీనటుడు బాలకృష్ణ అల్లుడు భరత్‌ను ఢీకొడుతున్నది. దగ్గుబాటు పురంధేశ్వరి రాజమండ్రి లోక్‌సభ నుండి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తూ వైసిపి అభర్థి డా॥గూడూరి శ్రీనివాస్‌ను ఎదుర్కొంటున్నది. 2019లో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో సుమారు 40లక్షల మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఐదుగురు మహిళలు లోక్‌సభలో అడుగుపెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా లోక్‌సభ ఎన్నికల్లో మహిళల సంఖ్య ఎప్పుడూ ఐదుదాటలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి 10మంది మహిళలు రాజ్యసభకు ఎంపికయ్యారు.

ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరు, తెలంగాణ నుండి కేవం ఒకరు మాత్రమే రాజ్యసభకు ఎంపికయ్యారు.


సుష్మా స్వరాజ్

ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరు, తెలంగాణ నుండి కేవలం ఒకరు మాత్రమే రాజ్యసభకు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1999లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అసెంబ్లీ స్పీకర్‌గా ప్రతిభాభారతిని నియమించింది. ఆమె ఆంధ్రప్రదేశ్ శాసనసభకు తొలిమహిళా స్పీకర్. ప్రస్తుత రాజ్యసభలో ఉభయతెలుగు రాష్ట్రాల నుండి మహిళల ప్రాతినిధ్యం లేకపోవడం దురదృష్టకరం. మహిళలను చిన్నచూపు చూస్తే ఎన్నికల ఫలితాలు తిరగబడతాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. 2023 సంవత్సరం చివరిలో జరిగిన తెలంగాణ ఎన్నికల్లో మహిళా ఓటర్ల ప్రభావం ఎన్నికల ఫలితాలను నిర్ధేశించినట్టు ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక పేర్కొనడం విశేషం. ఇక తెలంగాణలో ప్రముఖ పార్టీలన్నీ కలిపి మొత్తం 17లోక్‌సభ స్థానాలకుగాను కేవం ఆరుగురు మహిళలను మాత్రమే పోటీకి నిలబెట్టియా. ప్రధాన పార్టీలన్నీ తెలంగాణలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో సుమారు 12శాతం మాత్రమే మహిళలకు ప్రాతినిధ్యం కల్పించారు. సునీతారెడ్డి, కడియం కావ్య,ఎ.సుగుణ కాంగ్రెస్ అభ్యర్థులుగా, బి.జె.పి నుండి డి.కె. అరుణ, కొంపెల్ల మాధవీలత, బిఆర్‌ఎస నుండి మలోత్ కవిత ఎన్నికల బరిలో నిలబడ్డారు 2014లో కల్వకుంట్ల కవిత మాత్రమే లోక్‌సభలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించింది.

2019 లోక్‌సభ ఎన్నికల్లో మలోత్‌కవిత బి.ఆర్.ఎస్ నుండి ఎంపికయిన ఒకే ఒక మహిళా లోక్‌సభ సభ్యురాలు. విజయశాంతి, రేణుకాచౌదరిలాంటి వారు కేవలం ఎన్నికల ప్రచారానికే అంకితమైన, పోటీకి దూరంగా ఉన్నారు. తెలంగాణ మొదటి అసెంబ్లీకి 9మంది, రెండవ అసెంబ్లీలో 6గురు, ప్రస్తుత సభకు 10మంది మహిళా ఎమ్మెల్యేలు ఎన్నికకాగా వీరిలో



బి.ఆర్.ఎస్‌కు చెందిన లాస్యనందిత కొద్దికాలం క్రిందట రోడ్డుప్రమాదంలో మరణించారు. పద్మాదేవేందర్ రెడ్డి తెలంగాణ మొదటి శాసనసభలో డిప్యూటీ స్పీకర్‌గా పని చేసిన మహిళ. 2014 ఎన్నికల్లో టిఆర్‌ఎస్ నుండి 6గురు మహిళలు శాసనసభకు ఎన్నికకాగా, వీరిలో ఏ ఒక్కరికీ కె.సి.ఆర్ మంత్రి వర్గంలో చోటు దక్కలేదు. ఆరికి మహిళా శిశుసంక్షేమశాఖను కూడా పురుషే నిర్వహించడం అప్పట్లో గందరగోళానికి దారితీసింది. అసెంబ్లీలో మహిళల ప్రాతినిధ్యం లేకపోవడంతో అప్పట్లో హైకోర్టులో వ్యాజ్యం నడిచింది. తెలంగాణ 2వ శాసనసభలో సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌లకు మంత్రి పదవులు దక్కాయి. వీరే తెలంగాణ రాష్ట్రం ప్రథమ మహిళా మంత్రులు. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యాబినెట్లో ఇరువురు మహిళలు చట్టసభకు ఎన్నుకుని, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం విషయంలో మొదటిస్థానం సంపాదించింది. చత్తీస్‌ఘడ్ శాసనసభలో 18శాతం మహిళా ప్రాతినిధ్యం ఉంటే, హిమాచల్‌ప్రదేశ్‌లో మాత్రం ఒకే ఒక మహిళాశాసన సభ్యురాలుండడం, మిజోరం శాసనసభలో మహిళా ప్రతినిధులే లేకపోవడం విచాకరం. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ 14శాతం మహిళలతో మహిళల ప్రాధాన్యత గల రెండవరాష్ట్రంగా, జార్ఖండ్ అసెంబ్లీ 12మంది మహిళలతో మహిళా ప్రాతినిధ్యం గల రాష్ట్రాల్లో మూడవస్థానంలో నిలిచింది. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హర్యానా తదితర రాష్ట్రాల్ల మహిళల ప్రాతినిధ్యం 10-12శాతం మధ్య ఉంది. కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో మహిళల ప్రాతినిధ్యం రెండంకెల స్థాయికి దాటలేదు. స్వాతంత్ర్యానికి ముందే మహిళల హక్కులపై అనేక మంది పలు పోరాటాలు చేసారు. మహిళల అణచివేతకు వ్యతిరేకంగా నినదించారు. లింగభేదాన్ని నిరసించారు. ఆంగ్లేయుల కాలం నుండి మహిళలను రాజకీయాలకు దూరం చేసే కుట్ర జరిగింది. సమానత్వ సాధన కోసం జరిపే పోరాటంలో మహిళల ఆత్మాభిమానం దెబ్బ తినకూడదని కొంతమంది భావించారు. కొన్ని మహిళా సంఘాలు కూడా రిజర్వేషన్ల పేరుతో మహిళల స్వాతంత్ర్యాన్ని, ఆత్మాభిమానాన్ని పణంగా పెట్టకూడదని సూచించాయి. కేంద్ర చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని కొన్ని కమిటీలు తిరస్కరించాయి.

తెల్ల దొరల ఏలుబడి అంతమైన తర్వాత భారతదేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగి, 1952 ఏప్రిల్ 17న మొదటి లోక్ సభ ఏర్పడింది.

దేశంలో అప్పటి జనాభా సుమారు 37 కోట్లు కాగా, నాటి ఓటర్ల సంఖ్య 17.32 కోట్లు. అప్పటి లోక్‌సభ స్థానాల సంఖ్య 489. ఇందులో మహిళా సభ్యులు కేవలం 24 మాత్రమే. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ రూపకల్పన కోసం ఏర్పడిన రాజ్యాంగ సభలో అనేక చర్చలు జరిగాయి.

**తర్జనభర్జనల మధ్య రిజర్వేషన్లు**

మహిళలను పురుషులతో సమానంగా చూడాలనే వాదనతో మహిళల రిజర్వేషన్ల ప్రక్రియ ప్రశ్నార్థకమైంది. అప్పటి నుండి నేటి వరకు మహిళల రిజర్వేషన్ల విషయంలో అనేక తర్జన భర్జనలు జరిగాయి. రాజీవ్ గాంధీ, దేవెగౌడ, మన్మోహన్ సింగ్, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటివారు ప్రధాన మంత్రుల హోదాలో మహిళా బిల్లుకు కృషి చేసినా, కొన్ని పార్టీలు వ్యతిరేకించడంతో వారి ప్రయత్నాలు ఫలించలేదు. పంచాయితీ రాజ్ వ్యవస్థలో మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయిస్తూ ప్రవేశపెట్టిన బిల్లు 1989లో దిగువ సభ ఆమోదించిన ఎగువ సభలో మెజారిటీ లేక వీగిపోయింది. రాజీవ్‌గాంధీ మరణానంతరం అధికారంలోకి వచ్చిన పి.వి.నరసింహారావు నాయకత్వంలోని కాంగ్రెస్ మైనారిటీ ప్రభుత్వం 1992లో పంచాయితీ రాజ్ సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. 1993లో అన్ని రాష్ట్రాల ఆమోదం పొందింది. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీ రాజ్ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. దీనివలన 15 లక్షల మంది మహిళలు రాజకీయాల్లో ప్రత్యక్ష భాగస్వామ్యం వహిస్తున్నారు. దేవెగౌడ నాయకత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో 81వ రాజ్యాంగ సవరణ ద్వారా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియకు 1996 సెప్టెంబరు


రోజా

12వ తేదీన అంకురార్పణ గావించింది. సంకీర్ణ ప్రభుత్వంలోని వ్యతిరేకత వలన మహిళల రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందలేదు. ఆ తర్వాత 1998లో అప్పటి వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ కోసం ప్రయత్నించింది. లోక్‌సభలో గందరగోళం వలన మహిళల రిజర్వేషన్ల బిల్లు పడకేసింది. వాజ్‌పేయి ప్రభుత్వం తిరిగి ఎన్నిక కావడంతో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదానికి విఫల ప్రయత్నం చేసింది. ఆ తర్వాత మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యు.పి.ఏ. ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు కూడా లోక్ సభలో ఏర్పడిన అవాంఛనీయ పరిణామాల వలన సాధ్యం కాలేదు. 2010వ సంవత్సరం కాంగ్రెస్ నేతృత్వం లోని యు.పి.ఏ. సంకీర్ణ ప్రభుత్వ హయాంలో మహిళల రిజర్వేషన్లకు సంబంధించిన 108వ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. 2014వ సంవత్సరంలో లోక్‌సభ రద్దుతో ఈ బిల్లు ఆమోదం పొందలేదు.

**ఆమోదం పొందిన బిల్లు**

2014వ సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వంపై విపక్షాలు వత్తిడి తెచ్చినా మహిళా రిజర్వేషన్ల బిల్లు ముందుకు కదలలేదు. అయితే నరేంద్ర మోడీ రెండవసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, లోక్ సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళల ప్రాధాన్యత పెంచడానికి ఉద్దేశించిన 'నారీ శక్తి వందన్-అధినియమ్ 2023' పేరుతో మహిళా బిల్లు నూతన పార్లమెంటు భవనంలో సునాయాసంగా ఆమోదం పొందడానికి కృషి చేసారు. లోక్‌సభలో 454 మంది సభ్యుల మద్దతుతో, రాజ్యసభలో 214 మంది సభ్యుల మద్దతుతో 128 రాజ్యాంగ సవరణ బిల్లు 'నారీ శక్తి వందన్-అధినియమ్' అత్యధిక సభ్యుల మద్దతుతో 17వ లోక్‌సభలో ఆమోదం పొందడం, గతంలో మాదిరి వ్యతిరేకత కనిపించకపోవడం మహిళల పట్ల సమాజంలో వ్యక్తమౌతున్న సానుకూల స్పందనకు నిదర్శనం. 2014, 2019లో మహిళా రిజర్వేషన్ల బిల్లు తెస్తామని బి.జె.పి. చేసిన వాగ్దానం నెరవేరడంలో సుదీర్ఘ కాలం జాప్యం జరిగినా ఎట్టకేలకు తన వాగ్దానం నిలబెట్టుకుంది. 128వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం వలన ప్రస్తుతమున్న నియోజక వర్గాల ప్రాతిపదికన చూస్తే మహిళల ప్రాతినిధ్యం 181కి పెరుగుతుంది. లోక్‌సభ, రాష్ట్ర చట్టసభల్లో 33 శాతం మంది మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఆమోదం పొందిన ఈ బిల్లు వలన 15 సంవత్సరాల పాటు మహిళలు రాజకీయంగా లబ్ధి పొందుతారు. రాజ్యసభకు, శాసన మండళ్లకు ఈ రిజర్వేషన్లు వర్తించవు. నియోజక వర్గాల పునర్విభజన తర్వాత 2029 నుంచి మహిళల రిజర్వేషన్లు అమలవుతాయి. సమాజంలో అనేక నిర్బంధాలు, కుటుంబంలో అనేక కట్టుబాట్లు కొనసాగుతున్న తరుణంలోనే అనేక మంది భారతీయ మహిళలు ఎంతో ధైర్య సాహసాలతో ముందుకొచ్చి, అనేక రంగాల్లో తమ ప్రతిభను చాటారు. ఇందిరాగాంధీ, సరోజినీ నాయుడు, అరుణా అసఫాలీ, విజయలక్ష్మీ పండిట్, సుచేతా కృపలానీ, దుర్గాభాయ్ దేశ్‌ముఖ్, సావిత్రిభాయ్ పూలే తదితరులు దేశానికి ఒక దశా దిశ నిర్దేశనం చేసారు. అంతకు పూర్వం ఝాన్సీలక్ష్మీ భాయ్, రుద్రమదేవి వంటి మగువలు తమ శక్తి సామర్థ్యాలను చవి చూపించారు. ఇంతటి మహోన్నత మైన చరిత్రగల భారతీయ సమాజంలో మహిళలు చూపిన తెగువ, వారి ప్రతిభ, దేశం పట్ల వారు ప్రదర్శించిన అంకిత భావం చిరస్మరణీయం.

స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడమే దీనికి కారణం. స్త్రీలు రాజకీయంగా ఎదగలేకపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలకు రాజకీయ అధికారం దక్కాలని, చట్టసభలో ప్రాతినిధ్యం పెరగాలనే డిమాండ్ బయలుదేరింది. అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్న అవకాశాన్ని వదులుకోకుండా అంచెలంచెలుగా తమ రాజకీయ


సుచరిత

ఎదుగుదలకు మార్గం సుగమం చేసుకోకపోతే మహిళలు వెనకబడే ఉంటారన్న భావన మహిళా ప్రపంచంలో ప్రబలింది. ఈ కారణం గానే మహిళలకు చట్ట సభల్లో ప్రవేశం జరిగింది. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో చట్టసభల్లో మహిళల ప్రాధాన్యత పెరగాలని భావించి మహిళల రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు జరిగాయి. స్థానిక సంస్థల్ల మహిళలకు రిజర్వేషన్ల విషయంలో ముందుకొచ్చాయి. స్థానిక సంస్థల్లో మొదట మహిళలకు రిజర్వేషన్ల విషయంలో తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్.టి.రామారావు చూపిన చొరవ మరువలేనిది. ఆ తర్వాత దేశంలోని వివిధ రాజకీయ పక్షాలు మహిళల రిజర్వేషన్ల విషయంలో ముందుకొచ్చాయి. స్థానిక సంస్థల్లో మొదట మహిళలకు రిజర్వేషన్ల సౌకర్యం కల్పించడం జరిగింది. దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఎట్టకేలకు మహిళల రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటు ఆమోదం పొందింది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటు తీసుకున్న నిర్ణయానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర పడింది. భవిష్య భారత రాజకీయ యవనికపై మహిళలు నిర్వర్తించవలసిన క్రియాశీలక భూమిక గురించి, ప్రస్తుతం భారత్‌లో జరుగుతున్న 18వ లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు దక్కిన అవకాశాన్ని వినియోగించుకుని, గెలిచిన తర్వాత మహిళలు బాధ్యతగా తమ విద్యుక్త ధర్మాన్ని నిర్వరిస్తూ ఇప్పటి వరకు భారత రాజకీయాల్లో రాణించిన మగువల స్ఫూర్తితో విజయ కేతనం ఎగరేయాలని ఆశించడంలో అతిశయోక్తి లేదు. ప్రతిభకు లింగభేదాలు అడ్డు రాకూడదు. కట్టుబాట్ల పేరుతో స్త్రీల రాజకీయ ఎదుగుదలను నిరోధించకూడదు. ఈ విషయంలో స్వాతంత్ర్యోద్యమ కాలం నుండి ఇప్పటివరకు ధైర్య సాహసాలతో రాణించిన, రాణిస్తున్న మగువలను ఆదర్శంగా తీసుకోవాలి. రాజకీయాల్లో మహిళలు నిలదొక్కుకోవాలి.


సబితాఇంద్రారెడ్డి

## ఇందిరాగాంధీ ఆదర్శం

భారతదేశానికి తొలి, ఇప్పటివరకు ఏకైక మహిళా ప్రధాన మంత్రిగా నెహ్రూ తర్వాత దేశాన్ని అత్యధిక కాలం పాలించిన ఇందిరాగాంధీ ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని జన హృదిలో చిరస్థాయిగా మిగిలిపోయారు. రాజకీయాల్లో నిలదొక్కుకోవడానికి కేవలం ఆమె ప్రతిభా సామర్థ్యాలే ప్రధాన భూమిక పోషించాయి. పరిపాలనలో ఆమె చూపిన తెగువ, దేశ సమగ్రత పట్ల ఆమె చిత్తశుద్ధి అత్యంత ప్రశంసనార్హం. నాటి రాజకీయాల్లో అనేక మంది ఉద్దండుల మధ్య, తలలు పండిన రాజనీతిజ్ఞుల మధ్య నిలబడి, ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ప్రధానిగా సుదీర్ఘ కాలం పని చేయడం సాధారణమైన విషయం కాదు. ప్రతిభాపాటిల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నాయకురాలు అపారమైన రాజకీయ పరిజ్ఞానంతో ఎన్నో కలకమైన పదవులు అధిరోహించారు. మంత్రిగా, గవర్నర్‌గా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా భారతదేశానికి మొదటి మహిళా రాష్ట్రపతి పని చేసారు. భారతదేశపు తొలి ఐ.పి.ఎస్. అధికారిణిగా అత్యంత నిజాయితీతో పనిచేసిన మహిళ శ్రీమతి కిరణ్‌బేడీ పాండిచ్చేరి గవర్నర్‌గా పని చేసారు. ఒకానొక దశలో బి.జె.పి. కిరణ్‌బేడీని ఢిల్లీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించి, అరవింద్ కేజ్రీవాల్‌కు సవాల్ విసిరింది. కిరణ్‌బేడీ రాజకీయాల్లో రాణించకపోయినా ఒక పోలీసు అధికారిగా, సామాజిక కార్యకర్తగా తన బాధతను అత్యంత నిజాయితీతో నిర్వహించి, రామన్ మెగసెస్సే వంటి అవార్డులను గ్రహించి దేశ వ్యాప్తంగా అశేషమైన ప్రజాదరణ సంపాదించుకున్నారు.

సుష్మా స్వరాజ్ దివంగత ప్రముఖ బి.జె.పి. నాయకురాలు. ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ఇందిరా గాంధీ తర్వాత కేంద్ర విదేశాంగను అత్యంత సమర్థవంతంగా నిర్వహించి, ఢిల్లీకి తొలి మహిళా ముఖ్యమంత్రిగా పని చేసి, వాజ్‌పేయి, నరేంద్ర మోడీ క్యాబినెట్‌లో సమర్థవంతమైన నాయకురాలిగా పనిచేసి, ఒకానొక దశలో ప్రధాన మంత్రి పదవికి పోటీగా ధీటైన పాత్ర నిర్వహించిన సుష్మాస్వరాజ్ తెలంగాణ ఏర్పాటులో ప్రతిపక్ష నాయకురాలిగా కీలక పాత్ర పోషించి, చిన్నమ్మగా పిలవబడిన విషయం విదితమే.

భారతదేశానికి రెండవ మహిళా రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ద్రౌపది ముర్ము గిరిజన సవజంలో పుట్టి, పెరిగి, అంచెలంచెలుగా ఎదిగిన భారతీయ మహిళ. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ కుమార్తె శ్రీమతి మీరాకుమార్‌ను అప్పటి కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వం లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నుకుంది. ఈమె తొలి లోక్‌సభ మహిళా స్పీకర్. 2014-19 మధ్య కాలంలో అప్పటి బిజెపి ప్రభుత్వం లోక్‌సభ సభ్యురాలు సుమిత్రా మహాజన్‌ను లోక్‌సభ రెండవ మహిళా స్పీకర్‌గా ఎన్నుకోవడం జరిగింది. బిజెపికి చెందిన ఉమాభారతి మధ్యప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా, కేంద్రం మంత్రిగా పని చేసి, సమర్థవంతమైన నాయకురాలిగా పేరు గడించింది. అదే పార్టీకి చెందిన వసుంధరా రాజె సింధియా రాజస్థాన్ ముఖ్యమంత్రిగా పని చేసి, మహిళా నాయకురాలిగా ప్రజల్లో స్థానం సంపాదించింది. నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక మంత్రిగా ప్రస్తుత మోడీ మంత్రిమండలిలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాజ్యసభ సభ్యురాలైన నిర్మాలా సీతారామన్ దేశ తొలి మహిళా ఆర్థిక మంత్రి. ఈమె గతంలో రక్షణ శాఖను కూడా నిర్వహించింది. సోనియా గాంధీ ఇటలీకి చెందిన మహిళ. రాజీవ్ గాంధీని వివాహం చేసుకుని ఇండియాకు వచ్చి, భారతీయ సాంప్రదాయాలను ఆకళింపు చేసుకుని భారతీయ వనితగా పూర్తి స్థాయిలో పరివర్తన చెందారు. 'దీదీ'గా పిలవబడుతున్న మమతా బెనర్జీ పేద కుటుంబంలో జన్మించినా పుట్టగానే పరిమళించునన్న చందంగా విద్యార్థి దశలోనే సామాజిక స్పృహ కలిగి, నాయకత్వ లక్షణాలతో అలరించింది. ఆమె మొండితనం రాజకీయాల్లో ఆమెను శిఖరాగ్రానికి చేర్చింది. పి.వి.నరసింహారావు నాయకత్వం లోని కేంద్ర ప్రభుత్వంలో మానవ వనరుల అభివృద్ధి, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖలకు సహాయ మంత్రిగా పని చేసింది. వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ మంత్రి వర్గాల్లో కీలక బాధ్యతలు చేపట్టింది. కేంద్రంలో రెండు పర్యాయాలు రైల్వే మంత్రిగా పని చేసి, దేశంలో మొదటి మహిళా రైల్వే మంత్రిగా ప్రాచుర్యం పొందారు. బొగ్గు, గనుల శాఖకు కూడా మంత్రిగా పని చేసారు.

ప్రగతిలో పడతి పరిపూర్ణత్వం సాధించాలి. వర్తమాన ప్రపంచంలో సంభవిస్తున్న అనుకూల పరిణామాలు తిమిరం నిండిన అతివల జీవితాల్లో ప్రసరించే ఆశాజ్యోతులు. స్త్రీ, పురుషులు సుహృద్భా వంతో, సమానత్వంతో పరస్పర అవగాహనతో మెలగాలి. ఆనాడే మహిళల పట్ల వివక్షత అంతరిస్తుంది. ❑

# విజయబాటలో..

**ఈ.ఎస్.మాధవన్**



మన అమ్మమ్మకాలంలో రుబ్బు రోలు పక్కన స్టూల్‌మీద కూర్చొని దోసె, ఇడ్లీ కోసం రుబ్బడం చూసాం. ఇప్పటికీ అలా రుబ్బు రోలుతో చేసిన అట్టుఇడ్లీ రుచి అద్భుతం అంటుంటాం. అలా రుబ్బి తీయాలంటే కష్టం. పెద్ద కుటుంబ అవడంతో చేసుకుపోయే వాళ్లు. ఆ తర్వాత మారిన కాలంబట్టి చిన్న కుటుంబాలు రావడం, కుటుంబంలో భార్యాభర్తలు ఉపాధి నిమిత్తం అప్పటిలా పిండి రుబ్బుకునే సమయం, ఓపిక లేదు. దీంతో చాలామంది ప్రజలు పాకెట్ ఫుడ్‌వైపు ఆకర్షితులవుతున్నారు. ఇందులో భాగంగానే పాకెట్ పిండిలు కూడా వచ్చాయి. ప్రస్తుతం ఐడి ఫ్రెష్ అనే సంస్థ పౌచ్‌లలో ఇడ్లీ, దోశెల పిండిని సరఫరా చేస్తోంది. పరోటా చపాతీ, కాఫీ డికాక్షన్ వంటి ఆహార పదార్థాలను వేడివేడిగా అందిస్తోంది. ఎప్పుడు ఏది తినాలనిపిస్తే వాటి మిశ్రమాన్ని పౌచ్‌ల రూపంలో అందిస్తోంది ఐడీఫ్రెష్ సంస్థ. నిల్వ కోసం ఎలాంటి రసాయన పదార్థాలను కలపకుండా, ఎన్నో పరిశోధనలు చేసి, అందిస్తున్నారు. రుచి, ఆరోగ్యం రెండు సమపాళ్లలో అందిస్తున్నామని సంస్థ సిఇవో ముస్తఫ్ చెబుతున్నారు. సుమారు ఐదు దేశాలలో యాభైకి పైగా నగరాలలో తమ ఆహార పదార్థాలను అందిస్తున్నారు. ప్రతిరోజూ పదిహేను లక్షల ఇడ్లీలను అమ్ముతున్నారు. చిన్నతనం నుంచి ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొని, ఎంటెక్ వరకు చదువుకుని, బెంగళూరులో ఉద్యోగం పొందాడు. అనంతరం ఐర్లాండ్, గల్ఫ్ దేశాలను తిరిగి, కొన్ని మెలకువల్ని నేర్చుకుని, సంస్థను ఆరంభించారు.

**తెలుగురాష్ట్రాల్లో విజేత**

సూపర్‌మార్కెట్ కార్పొరేట్ రంగంలో సంచలనం సృష్టిస్తోంది. పాతిక సంవత్సరాల క్రితం ప్రారంభమైన 'విజేత' సూపర్‌మార్కెట్ నేడు పలు బ్రాంచలతో సక్సెస్‌ఫుల్‌గా నడుస్తోంది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్



ఎమ్.జగన్మోహన్‌రావు గుంటూరు జిల్లాలోని నిమ్మగడ్డవారిపాలెంలో చదువుకున్నారు. అనంతరం ఒక స్టోర్‌రూమ్‌లో బిల్లింగ్ క్లర్క్‌లో తన కెరీర్ జీవితాన్ని ఆరంభించి, అనంతరం స్టోర్ మేనేజర్‌గా ఎదిగారు. 1999లో విజేత సూపర్ మార్కెట్‌ను ఆరంభించి, లాభాల్లో కొన సాగుతోంది.

ప్రస్తుతం 110 స్టోర్‌లతో ఈ సంవత్సరం 840 కోట్ల వ్యాపారం చేసి, రాగల ఐదు సంవత్సరాలలో 200 స్టోర్‌రూమ్‌లను ప్రారంభించి, రెండువేల కోట్ల టర్నోవర్ చేయాలనీ పట్టుదలతో ముందుకెళ్తున్నారు జగన్మోహనరావు.






ఈవారం కవిత్వం

# నేనెందుకు చదువుతాను?



చదవకుండా ఉండలేను కాబట్టి.. చదువుతాను
నేర్చుకోవడానికి, ఎదగడానికి, నవ్వడానికి,
స్ఫూర్తి పొందడానికి!
ఇంతవరకూ నాకు తెలియని విషయాల్ని
అర్థం చేసుకోవడానికి చదువుతాను.
అనాలోచితంగా ఆత్మీయుల్ని విసుక్కున్నప్పుడు
చదువుతాను
మదనపడడమూ, మననం చేసుకోవడమూ
చదవడమే కదా?
భయంతోనూ, నిరాశా నిస్పృహలతోనూ
ముక్కలై పోతున్నట్లుగా అనిపించినపుడు
శక్తి కోసం చదువుతాను
ఈ ప్రపంచం మీద అమితమైన ఆగ్రహం
కలిగినప్పుడు చదువుతాను
అంతా సజావుగా ఉన్నప్పుడు కూడా
ప్రశాంతంగా చదువుతాను.
చర్మం, ఎముకలు, చూపులు,
భావాలతో మాత్రమే
కాదుగదా నేను రూపొందింది?
కోర్కెలతో, ధ్యేయాలతో, మాటలతో కూడా కదా
నేను రూపొందింది?
నా హృదయంలో దాగి ఉన్న భావాల్ని, ధ్యేయాల్ని
వ్యక్తీకరించడానికి మాటలు కదా కావాలి?
మాటలు సజీవం-నేనూ సజీవం.
నేను ఉన్న చోటే
మార్పుకోసం
నినదిస్తాను
నేను ఉన్నచోటే పిడికిళ్లు బిగిస్తాను
నా మాటలు మాత్రం విశ్వమంతా నినదిస్తాయి
నా మాటలే విశ్వమంతా పిడికిళ్లు బిగిస్తాయి
మాటలు సజీవం-నేనూ సజీవం
జీవాన్ని జీవంతో కలపడానికి చదువుతాను!
నేను ప్రేమించే కథ ఏదైనా కనిపించినపుడు
ఒకే పాట మళ్లీ మళ్లీ పాడుకుంటున్నట్టు..
ఒకే కథ మళ్లీ మళ్లీ చదువుతుంటాను.
ఆ పదాలతోనే నేను, కథలోకి ప్రవేశిస్తాను
ఆ పాత్రల్లో చేరి ఊపిరి పీలుస్తాను
వాటి నిర్వేదాన్ని, నిరాశల్ని నేను అనుభవిస్తాను
అవి ఏదైనా బుద్ధితక్కువ పని చేయబోతే,
కోపంగా అరుస్తాను.. వాటితో పాటూ నేనూ ఏడుస్తాను.
కాసేపటికి వాటితో పాటే మళ్లీ నవ్వుతాను-
చదవడమంటే నాకు-ఒక మంచి స్నేహితుడితో
గడిపినట్టుంటుంది!
పుస్తకం-ఒక మంచి మిత్రుడు
అయితే ఆ అనుభూతిని ఆ స్థాయిలో
అందించే పుస్తకాలు చాలా ఉండవు!
జాగ్రత్తగా ఎన్నిక చేసుకోవాలి!


- డాక్టర్ దేవరాజు మహారాజు

# సంఘర్షణ

మనసులోని ఆలోచనలు
జ్ఞాపకాల పొరలను తట్టి లేపి
అల్లకల్లోలం చేస్తుంటే
మనోభావాల యంత్రం
దేహాన్ని గాయపరచకుండా
మనసునే బాధపెడుతుంది.
నొప్పెక్కడో తెలియకపోయినా
కనపడని గాయం మాత్రం
పచ్చిపుండు తడై
తేమగా తాకుతూనే వుంటుంది.
ఆ నియంత్రిత చర్యకు
మనసులో ఎన్నో వర్ణాల
మనస్తత్వాలు
మనసు తెరచాటున
ముసుగేసుకుంటాయి.
ఓ వర్ణం
ఆనందపు సంతోషాలను
తట్టి లేపితే
వరికొన్ని
మనసును మెలిపెట్టే
తీరని వేదనలై
చుట్టూరా చేరుతాయి
ఇంకొన్ని.. విషాదపు ఛాయలై
అలుముకుంటాయి.
నిశ్శబ్దపు చెరను మనసుకు
శిక్షగా వేసుకున్నా
మనసుకు పరిస్థితులకు
మధ్య సంఘర్షణ సంవేదనలై
కొట్టుమిట్టాడుతూనే ఉంటాయి.

- నెల్లుట్ల సునీత






## డా॥వి.ఆర్.రాసాని-స్వప్నజీవి

డా॥వి.ఆర్.రాసాని, రచించిన 'స్వప్నజీవి' నవల స్కిజోఫ్రీనియాపై, అరుదైన, మనోవిశ్లేషణాసృజనతో చదువరులను ఆకట్టుకొంటోంది. ఈ నవలలోని ప్రధానపాత్ర 'హనీ' కళాకారునిగా, తాను చిత్రించిన మన్మథమంటపం కథనాన్ని, స్వప్నభ్రాంతిగా దర్శింపచేస్తాడు. సిగ్మండ్‌ఫ్రాయిడ్, సైకోఎనాలిసిస్ సిద్ధాంతాన్ని నవలగా రూపొందింప చేసే ఇతివృత్తంలో, తాను జీవితంలో పరాజితుపైన 'హనీ' మానసిక వ్యాధిగ్రస్తునిగా తనువు చాలించే సన్నివేశాలు, కథను నడిపించిన తీరుతెన్నులు రచయిత ప్రతిభావంతంగా చిత్రీకరించారు. చిత్రకారుడు, రంగస్థల నటుడు అయిన సున్నితహృదయంతో జీవించే కళాకారుని జీవన కథనం సువర్ణ సుందరి వంటి శిల్పసుందరి భ్రాంతి స్వప్నంగా, సైకాలజీ ఆఫ్ సెక్స్ శాస్త్రీయ దృక్పథం కథను జోడించే కల్పనా చమత్కృతి రచయిత దర్శింపచేసారు. అందమైన ఊహలతో, కలల ప్రపంచంలో జీవించే కళాకారుడు ప్రాపంచిక సాలెగూటిలో చిక్కు కొన్న పురుగులా, బలికావడం సాంసారిక సంక్షోభంతో క్రుంగికృశించి, కనుమరుగవడం అకాల మరణానికి చేరువ కావడం నిజజీవన గాథను అద్భుతంగా ప్రదర్శించారు. 'అల్పజీవి', 'చివరకు మిగిలేది' వంటి నవలల కోవలో డా॥వి.ఆర్.రాసాని స్వప్నజీవి తెలుగు నవలా సాహిత్యంలో అపురూపమైన మనోవిశ్లేషణాత్మక రచనగా నిలిచిపోయింది. **(స్వప్నజీవి, డా॥ వి.ఆర్.రాసాని, వెల: రూ 175, ప్రతులకు: అన్వీక్షికి ప్రచురణసంస్థ, అగ్రహౌస్, 59/సి/డి, ఎమ్.ఎల్.ఎ.కాలనీ బంజారాహిల్స్, హైదరాబాద్)**

**- యర్రమిల్లి**




## భర్తృహరి నాదానికి రఘువర్మ అనువాదం

స్వేచ్ఛానువాద ప్రక్రియలో సిద్ధహస్తుడైన రఘువర్మ మేఘసందేశమ్, ఋతుసంహారః, గీతాంజలి కావ్యాలను తెలుగులోకి అనువదించిన ప్రతిభావంతుడు. యిప్పుడు తాజాగా యోగకవి భర్తృహరి విరచిత 'నీతిశతకమ్'లోకి 100 శ్లోకాలకు వివరణాత్మక స్వేచ్ఛా కవితానువాద శతక ప్రతిని అందిస్తున్నారు. భర్తృహరి పేరు చెప్పగానే ఆయన సృజించిన శతకత్రయం 'భర్తృహరి సుభాషితమ్' గుర్తుకు రాకమానదు. నీతి వాక్యాలన్నా, సుభాషితాలన్నా ఒకటే. 'నీతిశతకమ్' అనువాద సంపుటిలోని శ్లోకములను మూర్ఖపద్ధతి, విద్యపద్ధతి, సుజన పద్ధతి, పరోపకార పద్ధతి, దైవపద్ధతి అను విభాగాలుగా వర్గీకరించి అలతి అలతి పదాలతో, అందరికీ అర్థమయ్యే సరళ భాషలో అందిస్తున్నారు రఘువర్మ. సంస్కృత కవి భర్తృహరి శ్లోకాలను మూలాతిక్రమణ లేకుండా, మూలంలోని భావార్థాలు సులభంగా బోధపడేలా, ఔచిత్యం, సముచిత పదప్రయోగంతో, మధురశైలిలో సహజరీతిలో అనువాదం సాగిపోయింది. మచ్చుకు ఒకటి..'రాజా! ఓ రాజా!/ సుపరిపాలనాత్మకమైన ఆజ్ఞ, మచ్చలేని కీర్తి, బ్రాహ్మణరక్షణా, అర్థదానమూ, సుఖ భోగాలూ, కష్టాల నుండి మిత్రులను కాపాడటం/ ఈ ఆరుగుణాలు ఏ రాజుల దగ్గర వుండవో/ వాళ్లను ఆశ్రయించడం వల్ల ఏంలాభం?' నేటి పాలకుల వద్ద ఈ సద్గుణాలలో కొన్నైనా వున్నవా? ఆలోచించాల్సిన విషయం. **(నీతిశతకము, స్వేచ్ఛాకవితానువాదం 'రఘువర్మ' (డా॥టి.లక్ష్మీనారాయణ), వెల: రూ 120, ప్రతులకు: నవచైతన్య, నవోదయ బుక్‌హౌస్‌లు)**

- రమణ వెలమకన్ని

**పుస్తక సమీక్ష**

సాహితీ లోకానికి రచయితగా, సాహితీపోషకులుగా పేరుగాంచిన చలపాక ప్రకాశ్ 'అప్పగింతలు' కథా సంపుటిలో 29 కథలున్నాయి. వీటిలో చాలావరకు లోగడ పలు పత్రికలు, అంతర్జాల మీడియాలో ప్రచురింపబడి ప్రశంసలందుకున్నవే కనుక నిఖార్సైన సాహితీ విలువల్ని కలిగి ఉన్నాయి. ఒక కథకుడిగా కవిగా వ్యాసకర్తగా రమ్యభారతి సంపాదకులుగా ప్రకాశ్




## విశ్వాసం, ప్రేమను పెంచే కథలు

చేయితిరిగిన రచయిత. వీరిలో ఉన్న మరో సుగుణం కథకు అనవసర పొడిగింపులు వర్ణనలు వివరణలు ఇవ్వకుండా అవసరమైనంత మేర మాత్రమే ఇచ్చి కథను ముగించటం. అందుకే కథల్లో కొన్ని 6,7 పేజీల వరకు ఉన్నాయి. కథ నడిపించవల్సిన చతురత తెలిసిన చలపాక ప్రత్యేకత ప్రతికథలోనూ కనిపిస్తుంది. ఎంతటి జనారణ్యంలో ఉన్నా మనిషి'ఏకాకి' కాకూడదు అని 'జగమంత కుటుంబం' చెబుతుంది. జీవితం అన్నది అనుకున్న రీతిన ఎప్పుడూ సాగదని, అనుకోని మలుపులు ఎన్నో ఉంటాయని, నువ్వు ఆలోచించినట్లే నీ సంతానం ఆలోచించదు అని 'జీవితం' కథ చెబుతుంది. 'కార్పొరేట్ వైద్యం నేడు ఎంతటి విపరీత మార్గాన నడుస్తోందో 'భూలోక నరకం' చెబుతుంది. అవయవదానం గొప్పతనం, 'తీరని కోరిక' చెబుతుంది. మంచి కథల్ని చదివిన సంతృప్తిని కలిగిస్తాయీ కథలన్నీ.
**(అప్పగింతలు, రచన: చలపాక ప్రకాశ్, వెల: రూ 125, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

- కూర చిదంబరం

బేతి (మిట్టపెల్లి) లక్ష్మీరాజు (అమ్మ)కి ఈ రచన అంకితం చేసారు. ఇది రచయిత స్వీయచరిత్రే కాదు ఆయన్ని నడిపించిన కాలం చరిత్ర, నడయాడిన నేలచరిత్ర. 1990ల నుండి అపుడపుడు రాసిన స్వీయచరిత్ర వ్యాసాలు ప్రముఖ దినపత్రికల్లో ప్రచురిం



## 'బి.ఎస్.రాములు జీవనగమనం

చిన వ్యాసాలూ ఇందులో ఉన్నాయి. ప్రపంచీకరణ అందించిన అవకాశాలు అందుకొని పిల్లలు ఎదిగారు అంటారు రాములు. ఆధునిక భారతీయ సామాజిక తత్త్వవేత్త అంటూ నూలు శ్రీరామచంద్రరావు, చైతన్య స్ఫూర్తిని నింపే బతుకు పయనం అంటూ చెందాళం క్రిష్ణారావు అసామాన్యుడుగా ఎదిగిన సామాన్యుడి కథ అంటూ పి.చంద్ చక్కటి ముందుమాటలు రాసారు. దాదాపు 24 అధ్యాయాలుగా యీ పుస్తకాన్ని విభజించి ముఖ్యాంశాలు తేదీలు ప్రాంతాలు వ్యక్తులు సూక్తులు ఉద్యమాన్ని అద్భుతంగా అక్షరీకరించారు రాములు. చింతనాపరుడుగా తత్త్వవేత్తగా పరిశోధకునిగా, ఉద్యమ నేతగా బహుజన ఉద్యమాల నిర్మాతగా, కవిగా, రచయితగా, రాడికల్‌గా, రాష్ట్రీయ స్వయం సేవక్‌గా, సామాజిక పరిణామక్రమంలో ఎన్నెన్నో పార్శ్వాలు నిజాలు ఇజాలు అద్భుతంగా రాములు అక్షరీకరించారు.సామాజిక కార్యకర్తలకు, రాజకీయ కార్యకర్తలకు, పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఈ పుస్తకం బహుళ ప్రయోజనకారి కాగలదు. రాములుకు అభినందనలు. (నా బాల్యం, నా ప్రయోగాలు, రచన: బి.ఎస్.రాములు, వెల: రూ 100, పత్రులకు: విశాల సాహిత్య అకాడమీ, ఆర్.కె.నగర్, బాగ్అంబర్‌పేట్, హైదరాబాద్) **- తంగిరాల చక్రవర్తి**

ఒక వ్యక్తి బరువు కోల్పోయిన లేదా పెరిగిన, అతడు చుట్టూ పక్కల ఉన్నవాటిపైన దృష్టి సారించక, చిరాకులకు గురవుతూ, ఒంటరి భావనకు లోనవుతాడు. బంధువులతో, కుటుంబీకులతో సహా ఉద్యోగుల వలన ఇలాంటి భావనలకు లోనవుతుంటారు. ఒత్తిడి ప్రభావాలు తలనొప్పి, కండర ఉద్రిక్తత లేదా నొప్పి, ఛాతీ నొప్పి, అలసట, తరచూ మూత్రవిసర్జన, కడుపునొప్పి, నిద్రపోవడం. ఇది మీ మానసిక స్థితి ప్రవర్తనపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది.
ఆందోళన, విశ్రాంతి లేకపోవడం,

# డిప్రెషన్‌తో 'ఢీ'!



**డిప్రెషన్ అనేది, మనస్సుకు సంబంధించిన ఒకరకమైన రుగ్మతగా పేర్కొనవచ్చు. డిప్రెషన్‌తో బాధపడుతున్నారంటే, వారు విచారం, నిస్సహాయత, అపరాధ, నిరాశవాహభావనలతో కొట్టిమిట్టాడుతున్నారని అర్థం. భావోద్వేగాలు సహజంగా మారుతాయి. మనసు యొక్క శారీరక, మానసిక పరిస్థితులలో మార్పులను తీసుకువస్తాయి.**

ప్రేరణ లేకపోవడం, చిరాకు, అనవసరమైన కోపం, విచారం, నిరాశ వంటి లక్షణాలు ఏర్పడతాయి. ఒత్తిడి తీవ్రమైన లేదా దీర్ఘకాలికంగా ఉంటుంది. చాలా సమస్యలు అధిక రక్తపోటు, ఊబకాయం, గుండెజబ్బులు, ఆందోళన నిరాశకు దోహదపడతాయి. ఇతర సమస్యల మధ్య, ఇది సాధారణంగా ఒక వ్యక్తి జీవిత ఆనందాన్ని కూడా తగ్గిస్తుంది. పోటీ ప్రపంచంలో చిన్నాపెద్దా తేడా లేకుండా ఒత్తిడి ఎదుర్కొంటున్నారనటంలో సందేహం లేదు. ఒకస్థాయి వరకు మంచి ఫలితాలను చూపించే ఒత్తిడి, ప్రమాదకర స్థాయిలోకి వెళ్తే మాత్రం డిప్రెషన్‌కు దారితీయడం అటు నుంచి ఆత్మహత్యకు దారితీసే పరిస్థితికొస్తుంది. అందరు తరచుగా వల్లించే పదం డిప్రెషన్. ప్రతిరోజు మనం ఎంతో మందిని చూస్తూ వుంటాం. కొందరు నిరాశ, నిస్పృహలతో



**తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి**

వుంటారు. ఆనందమైన జీవితాన్ని ఎన్నో ఇబ్బందులతో గడుపుతూ వుంటారు. పనులను జాప్యం చేయటం. ఏకాగ్రత లోపించటం. విపరీతంగా దిగాలు పడటం. వ్యక్తుల పట్ల, దైనందిన చర్యల పట్ల ఆసక్తి నశించటం. సరైన నిర్ణయాలు తీసుకోలేక పోవటం. ఆకలి మందగించటం, బరువు పెరగటం మొదలైనవి డిప్రెషన్ లక్షణాలుగా భావించవచ్చు. సహజంగా డిప్రెషన్‌కు గురైన వారి భాగస్వామితో సరదాగా గడపలేరు. నిత్యం ముభావంగా ఉంటూ, ఒంటరితనాన్ని కోరుకుంటారు. సరదాలు, సంతోషాలకు దూరమవుతుంటారు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నవారిలా ఆలోచిస్తుంటారు. ప్రతికూల ఆలోచనలు, ఆత్మహత్యాభావాలు కలుగుతుంటాయి. నిద్ర, ఆహారం, ఇతర కృత్యాలకు దూరమవుతుంటారు. సానుకూల దృక్పథం, కలుపుగోలు మనస్తత్వం, చక్కని వ్యాయామం, సత్సాంగత్యం, సమతుల ఆహారం, సరిపడా నిద్ర నిత్య యవ్వనానికి ఔషధంగా పనిచేస్తాయి. సమయపాలన, సమస్యలను పరిష్కరించుకునే యుక్తి, ప్రాధాన్యతలు పాటించడం ద్వారా ఒత్తిళ్లను తగ్గించుకోవచ్చు.

యోగ, ధ్యాన ప్రక్రియలు ఒత్తిళ్లనుంచి ఉపశమనానికి దోహదపడతాయి. వ్యాయామం ఒక గొప్ప ఒత్తిడి నివారణగా పనిచేస్తుంది. అది ఏరోబిక్, మితమైన తీవ్రత లేదా అధిక-తీవ్రత వ్యాయామం. ఇది ఒత్తిడి హార్మోన్లు తగ్గించడానికి, మీ శరీరంలో 'మంచి అనుభూతి' హార్మోన్లు పెంచడానికి సహాయపడుతుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు కొన్ని రకాల వ్యాయామం చేయటానికి సమయాన్ని కేటాయించాలి. కొంచెం నడక, ఈత, నృత్యం కొన్ని క్రీడలను ఆడవచ్చు. ఒత్తిడిని పోరాడటానికి యోగాను కూడా అభ్యసించవచ్చు. మనస్సు, శరీరం రెండింటినీ ప్రశాంతపరిచే యోగా ధ్యానంలా పనిచేస్తుంది.

ఇది దృష్టిని మెరుగుపరుస్తుంది. చేసే పనుల్లో ప్రశాంతంగా, స్పష్టంగా ఉండటానికి సహాయపడుతుంది.

మానసిక ఒత్తిడికి లోనైన వాళ్లు ఇతరులతో సరదాగా మాట్లాడలేరు. అంతకుముందు వుండే చదువు, హుషారు తగ్గిపోయి ముభావంగా మారిపోతారు. ఒత్తిడివల్ల ఆత్మవిశ్వాసం సన్నగిల్లి ఆత్మన్యూనతాభావం ఆవహిస్తుంది. బద్ధకం, వాయిదాల మనస్తత్వం అలవడుతుంది. ఆధునిక దంపతుల్లో శృంగారాసక్తి తగ్గిపోయి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పలు సర్వేలు తెలుపుతున్నాయి. ఇప్పటి యువ దంపతుల్లో ఈ సమస్యలు ఎక్కువగా వున్నట్టు అధ్యయనాలు తేల్చి చెపుతున్నాయి. ఇందుకు మానసిక ఒత్తిడి ఒక కారణం. మానవ జీవన విధానంలో వేగం పెరిగినప్పటి నుంచి రకరకాల మానసిక ఒత్తిళ్లు మనిషిని కృంగదీయడం మొదలయ్యింది. ఇంటా, బయటా ఎన్నో సమస్యలు ఎదురవుతుంటాయి. ఆ సమస్యలు సతమతానికి గురిచేసి ఒత్తిడికి కారణమవుతాయి. తీరికలేని పనులు, నిద్రలేని రాత్రులు మనిషిలో ఉత్సాహాన్ని హరించివేస్తాయి. దీంతో నిరాశ నిస్పృహ ఆవహించి శృంగారాసక్తి తగ్గిపోతుంది. మానసిక ఆరోగ్యం ఒక సమస్యగా మారుతున్నది. ఒకప్పుడు అంటువ్యాధులు మనుషుల్ని బలితీసుకున్నాయి. ఇప్పుడు మానసిక మానోశారీరక రుగ్మతలు కృంగదీస్తున్నాయి. ఇందులో డిప్రెషన్ అత్యంత ప్రమాదకారిగా మారుతున్నది. సహజంగా జీవితంలో దేన్నయినా కోల్పోయిన పుడు కలిగే దుఃఖం వలన మనలో కలిగే డిప్రెషన్ ఈ కోవకే చెందుతుంది. డిప్రెషన్ ఎవరికి వస్తుందనే విషయాన్ని పూర్తిగా కనిపెట్టడం కష్టమే. అయినా ఒక్కోసారి ప్రత్యేక కారణాలు లేకుండానే వ్యక్తి డిప్రెషన్‌కు లోనుకావచ్చు. అనారోగ్య కారణాలవల్ల కూడా కావచ్చు. ఒక వ్యక్తి అన్ని సౌకర్యాలతో హాయిగా జీవిస్తున్నా ఎప్పుడో ఏదో ఒక చిన్న తప్పు చేసి ఉండవచ్చు. కొందరు తాము తప్పు చేశాం కాబట్టి అన్నీ తప్పులే చేస్తామని, లేదా తాము చేసినవన్నీ తప్పులనే ఆత్మన్యూనతా భావానికి లోనవుతారు.



చివరకు తీవ్రనిరాశా, నిస్పృహలతో ప్రపంచాన్ని నెగెటివ్‌గా చూసి డిప్రెషన్‌కు లోనవుతారు. డిప్రెషన్ సాధారణంగా శారీరకంగా బయటపడుతుంది. తలనొప్పి, ఒళ్లునొప్పులు, నిద్రలేమి, ఆకలి మందగించడం గుండెవేగంగా కొట్టుకోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. డిప్రెషన్‌లో ఉన్న వ్యక్తి సరిగా ఆహారం తీసుకోరు. నిద్రపోరు, బరువు కూడా తగ్గుతారు. చిన్నచిన్న పనులకు కూడా బాగా అలసిపోతారు. ఏదో తప్పు చేశామనే ఫీలింగ్‌తోనే కుంగిపోతారు. డిప్రెషన్‌లో ఉన్నవారు కొందరు మద్యం సేవించడం కూడా చూస్తుంటాం. ఇలాంటి సమయాల్లో వీటికి అలవాటుపడకూడదు. అలవాటు ఉన్నా శృతిమించకూడదు. డిప్రెషన్‌కు లోనైనపుడు దానికసలు కారణాలేమిటో తెలుసుకోవాలి. ఆ కారణాలకు దిగులు పడాల్సిన అవసరం ఎంతవరకుందో ఆలోచించాలి. మనసు కుదుట పడేలా ప్రశాంత వాతావరణంలో గడపాలి. రిలాక్సేషన్ కోసం ఏరోబిక్ ఎక్సర్‌సైజులు, యోగ, ధ్యానం లాంటివి ప్రాక్టీస్ చేయాలి. లేనిపోని ఆలోచనలను పక్కనపెట్టి చేస్తున్న వృత్తిలో నిమగ్నం కావాలి. పని ఒత్తిడివల్ల కూడా డిప్రెషన్‌కు



లోనుకాకుండా చూసుకోవాలి. వీలైనంత వరకు మనం చేసే వృత్తిలో పని ఒత్తిడిని మామూలుగానే తగ్గించుకోవాలి. ఒంటరిగా కూర్చోవడం కన్నా ఆత్మీయులతో, బంధుమిత్రులతో కలిసి కబుర్లు చెప్పుకోవడమే మిన్న. ఓదార్పు-సాంత్వన అన్నిటికన్నా అవసరం. వీటికి దూరంగా ఉండడమే మేలు. లేనిపోని ఆలోచనలతో, డిప్రెషన్‌తో బాధపడేవారిలో 15 మంది ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందని మనోవైద్య నిపుణులు అంటున్నారు.

### ఆహారంతో చెక్

కేవలం మానసిక పరిస్థితులే కాదు, తినే తిండి కూడా మనసు మీద తప్పక ప్రభావం చూపిస్తుంది. విపరీతమైన మిఠాయిలు, ఉప్పు, నూనెలు, కొవ్వు కలిగిన పదార్థాలతో జాగ్రత్తగా ఉండాలి. వాటిని తినడమే వ్యసనంగా మారితే ప్రమాదం. ప్రొటీన్లు కలిగిన పదార్థాలతో పాటు పప్పుధాన్యాలు, తాజాపండ్లు, కూరగాయలు, చేపలు తినడం ఉత్తమం. ఇవన్నీ గుడ్‌మూడ్ ఫుడ్స్. ముఖ్యంగా ఒమెగా-3 ఫ్యాటీయాసిడ్స్ కలిగిన ఆహారానికి డిప్రెషన్‌ను తగ్గించే గుణం ఎక్కువ. అలాంటి యాసిడ్స్‌కు పెట్టింది పేరు వాల్‌నట్స్. ఇవి తింటే మెదడుకు పనికొచ్చే ఆహారం తిన్నట్లే. తద్వారా మెదడు చురుగ్గా మారి ప్రశాంతత ఏర్పడుతుంది. చేపలు రుచికి రుచి కాదు, బ్రెయిన్ బూస్టింగ్ ఫుడ్ కూడా. డిప్రెషన్‌కు దివౌషధం పసుపు. పసుపులోని టర్మరోన్స్, కర్క్యూమినోడ్స్ వంటి కంపౌండ్లు మనసుకు ఉల్లాసాన్ని కలిగిస్తాయి. మానసిక దౌర్బల్యం రాకుండా అడ్డుకుంటాయి. సెరటోనిన్ అనే రసాయనానికి బిగుసుకుపోయిన రక్తనాళాలకు ఉపశమనం కలిగించే గుణం ఉంది. డార్క్ చాకొలెట్ సెరటోనిన్ కార్డియో వాస్కులర్ సిస్టమ్ సరిగా పనిచేసేందుకు తోడ్పడుతుంది. 25 గ్రాముల డార్క్ చాకొలెట్ తింటే సుమారు 150 క్యాలరీల శక్తి లభిస్తుంది. లక్ష్యాన్ని చేరుకోవాలంటే కాలంతో పాటు పరుగెత్తాల్సిందే. ఈ క్రమంలో ఎదురయ్యే ఒత్తిడిని అదుపులో ఉంచుకోకపోతే ఇతర అనారోగ్యాలు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. ఒత్తిడిని తట్టుకోవడానికి ఆహారపరంగానూ కొన్ని మార్పులు చేసుకోవాల్సిందే. ❍

కథ

# నివృత్తి

**పూర్వం** శివానందుడు అనే గురువు తన శిష్యబృందంతో దేశాటన చేస్తూ ప్రజలకు హితబోధ చేస్తూ, వారి ధర్మసందేహాలనూ తీర్చుకుంటూ కొంతకాలానికి సింహపురి రాజ్యానికి చేరుకుంటాడు. ఆ దేశరాజు అయిన విజయసింహుడు ఆ గురువు గొప్పతనాన్ని తెలుసుకుని తన భటులను పిలిచి శివానందుడు, అతని శిష్యులను మన ఆస్థానానికి తీసుకునిరావాలని ఆదేశించాడు.



రాజు కోరిక మేరకు శివానందుడు అతని శిష్యబృందాన్ని ఆస్థానంకూ తీసుకువస్తారు భటులు. శివానందుడిని చూసినా రాజు విజయసింహుడు లేచి గురువుకు నమస్కరించి అతని ఆశీర్వాదం తీసుకుంటాడు. వాళ్లకు అతిథిమర్యాదలు చేసి కొంత విశ్రాంతి తీసుకున్న తరువాత రాజు శివానందుడితో 'స్వామీ! ఈ ప్రపంచంలో జ్ఞానం గొప్పదా; ప్రవర్తన గొప్పదా? నా సందేహాన్ని నివృత్తి చేయగలరా?' అని రాజు అడిగాడు. దీంతో శివానందుడు కొంతసేపు ఆలోచించి 'మహారాజా! మీ సందేహాన్నికి నివృత్తి కావాలంటే నాకు 'ఆరు' రోజుల గడువు ఇవ్వండి మీ ప్రశ్నకు సమాధానం కనుగొంటాను' అని శివానందుడు అనగానే అతని కోరిక మేరకు రాజు వాళ్లకూ అతిథిగృహం కల్పించి, సకల మర్యాదలు చేయవలసిందిగా భటులకు అజ్ఞాపించాడు.



మొదటిరోజు అర్ధరాత్రి అందరూ నిద్రిస్తుండగా శివానందుడు లేచి రాజు ధనాగారానికి వెళ్లి కొన్ని బంగారు నాణాలను తన సంచిలో వేసుకుని తిరిగి తన ఇంటికి వచ్చి పడుకున్నాడు. రెండోరోజు కూడా అలాగే చేసాడు శివానందుడు. అతని దొంగతనాన్ని గమనించి భటులు రాజుపై ఉన్న గౌరవంతో శివానందుడిని చూస్తూ నిలబడతారు. ఒకరోజు విసుగొచ్చి భటులు శివానందుడి గురించి రాజుకు చెబుతారు. దాంతో విజయసింహుడు ఆక్రోశంతో శివానందుడిని పిలిచి 'నాకు ఆరురోజులు గడువు కావాలని అన్నది దొంగతనం చేయడానికేనా? వేరేవారిని అయితే శిక్షించేవాడిని, మిమ్మల్ని కాబట్టి మాటలతో సరిపెడుతున్నాను' అన్నాడు. శివానందుడు నవ్వుతూ తాను దొంగిలించిన బంగారు నాణాలను రాజుముందు పెడుతూ 'మహారాజా! మొదట నా జ్ఞానాన్ని తెలుసుకుని నన్ను సాదరంగా ఆహ్వానించి సకల మర్యాదలు చేసిన మీరు దొంగతనం చేసాను అనే నెపంతో తక్షణమే వెళ్లిపోండి అంటున్నారు. అంటే నా ప్రవర్తన సరిగ్గా లేదని అర్థం. అందుకే 'ఎంత జ్ఞానం ఉన్నా ప్రవర్తన సరిగ్గా లేకుంటే సమాజంలో విలువ ఉండదు' ఇదే మహారాజా! మీరు అడిగిన ప్రశ్నకు సమాధానం' అని గురువు శివానందుడు అనగానే రాజు విజయసింహుడు అవమానంతో తలదించుకుని 'క్షమించండి స్వామీజీ! ఏదో క్షణికావేశంలో అన్నాను. నా సందేహాన్ని నాతోనే నివృత్తి చేయించారు' అని శివానందుడికి నమస్కరించాడు రాజు విజయసింహుడు.

## బాలగేయం

### ఇష్టం



మాకిష్టం మాకిష్టం
పచ్చని పల్లెలు మాకిష్టం
మాకిష్టం మాకిష్టం
పక్షుల కూతలు మాకిష్టం
మాకిష్టం మాకిష్టం
పాడిపంటలు మాకిష్టం
మాకిష్టం మాకిష్టం
పనులు చేయటం మాకిష్టం
మాకిష్టం మాకిష్టం
పరిశుభ్రత మాకిష్టం
మాకిష్టం మాకిష్టం
మంచిని పెంచటము
మాకిష్టం మాకిష్టం
మంచిని పంచుట
మాకిష్టం మాకిష్టం
మంచిని వినటం మాకష్టం
మాకిష్టం మాకిష్టం
మంచిని చేయటం
మాకిష్టం మాకిష్టం

- చాడా మునిశేఖర్‌రెడ్డి

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

- ఎస్.మాణిక్యం, హైదరాబాద్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మనకు ఉన్నట్లుగానే చెట్లకు కూడా పంచేంద్రియాలు ఉన్నాయా?

**జవాబు: మాణిక్యం!** చెట్లు, చేమల విషయంలో పరిశీలిస్తే చెట్లు కాంతి, స్పర్శ అనే రెండు ఇంద్రియ జ్ఞానాలతో బతికేస్తుంటాయి. మనిషి మాత్రం ఈ రెండింటితో పాటు కాంతిలోని తేడాలను కూడా గుర్తించగలడు. వాటి ద్వారా వస్తువులను, వ్యక్తుల రూపురేఖలను గుర్తించగలుగుతాడు. శబ్దాలను వినగలగడంతో పాటు, గొంతు స్వరాలను గుర్తించడం, సంగీతాన్ని ఆస్వాదించడం, సంక్లిష్టమైన రసాయన మిశ్రమాలను వాసన చూస్తాడు. అదే సమయంలో నిర్దిష్ట రసాయనాల మిశ్రమాన్ని ఐస్‌క్రీమ్ అనీ, కాఫీ అని వేరు వేరుగా చేసి గుర్తిస్తాడు. శరీర అవయవాల ద్వారా అందుకునే సంకేతాలకు మెదడు చేర్చే అదనపు విలువే 'ఇంద్రియ జ్ఞానం' అని అర్థమవుతుంది. మనకు మాత్రమే గల పంచేంద్రియాలకు జ్ఞాపకశక్తి, అనుభవాలు తోడైతేనే సమగ్రంగా ఇంద్రియ జ్ఞానం అలవడుతుంది.

- పి.వంశీకృష్ణ, కాకినాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కృత్రిమ వజ్రాలను ఎలా తయారు చేస్తారు?

**జవాబు: వంశీకృష్ణ!** 1955 వరకు వజ్రం గనుల ద్వారానే లభించేది. ఆ తరువాత 1955లో అమెరికాలోని జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ ప్రపంచంలో మొట్టమొదటిసారిగా కృత్రిమ వజ్రాలను తయారు చేసింది. అత్యధిక ఉష్ణాన్ని అందించే కొలిమిలలో గ్రాఫైట్‌ను మూడు వేల డిగ్రీ సెంటీగ్రేడ్ వద్ద వేడి చేస్తారు. గ్రాఫైట్ వజ్రంగా రూపు దిద్దుకుంటుంది. ప్రకృతిసిద్ధంగా లభించిన వజ్రాన్ని పోలి ఉంటుంది. వీటిని సింథటిక్ వజ్రాలని కూడా అంటారు.

# కొరియన్ క్రేజ్..



**కె-పాప్,** కె-డ్రామా, కె-ఫుడ్, కె-ఫ్యాషన్ అంటే అందరికీ అర్థంకాకపోవచ్చు కానీ టీనేజర్లను అడిగి చూడండి..'మీకు ఇది కూడా తెలియదా' అంటూ వింతగా చూస్తారు. 'కె' అంటూ రొనిచప్ అపీ. అదీ దక్షిణ కొరియా అనీ, ఇప్పుడదే తమ స్టైలూ, ట్రెండూ అంటూ చెప్ప కనే చెబుతారు. అంతగా ఇప్పుడు వాళ్లను ముంచేస్తోంది ఈ కొరియన్ వేవ్. ప్రపంచదేశాల్ని మాయ చేస్తున్న ఈ కె-క్రేజ్ మనదేశంలోనూ కొత్త మార్క్ వేస్తోంది.

ఒక అమ్మాయి చిన్నప్పటి నుంచీ తను అందంగా లేనని బాధపడుతుంటుంది. చూడ్డానికి వికారంగా ఉన్నావంటూ తోటి పిల్లలూ ఆట పట్టిస్తుంటారు. హైస్కూల్‌లోనూ ఎవరూ తనతో స్నేహం చేయడానికి ఇష్టపడరు. అది భరించలేక ఏడుస్తూ ఓరోజు చనిపోవాలని నిర్ణయించుకుంటుంది. అప్పుడే అనుకోకుండా వచ్చిన



ఒక చిన్న ఆలోచన ఆ అమ్మాయి జీవితాన్నే మార్చేస్తుంది. అందంగా కనిపించడానికి మేకప్ వేసుకోవడం మొదలుపెడు తుంది. అది ఎంత బాగా చేసుకుంటుందంటే..ఆ మేకప్ వల్ల ఆ అమ్మాయి రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. ఎవరూ దాన్ని మేకప్ అనుకోలేనంత సహజంగా కనిపిస్తుందా అమ్మాయి. అలా ఆమె బాగా ఫేమస్ అయ్యి సెలెబ్రిటీలకు మేకప్ వేస్తూ కాస్మొటాలజిస్ట్‌గా రాణిస్తుంది. పూర్తిగా ఒక అమ్మాయి అందం చుట్టూ ఉండే ఈ కథ 'ట్రూ బ్యూటీ' అనే ఓ కొరియన్ డ్రామా. ఇది ఈతరం పిల్లల్ని ఎంతగా ఆకర్షించిందంటే..కొరియన్ సిరీస్ మీద మనసు పారేసుకునేంత. మేకప్‌లోనూ ఆ దేశానికి సంబంధించిన వస్తువుల్నే భాగం చేసుకునేంత. ఇదొక్కటే కాదు..ఇలా ఒక్క మేకప్ విషయంలోనే కాదు..అక్కడి సంస్కృతీ, ఆహారమూ, అలవాట్లూ, ఫ్యాషన్లు చూపిస్తూ ప్రేక్షకుల మనసు దోచేస్తున్నాయీ కె-డ్రామాలన్నీ. అందుకే మరి, ఇతర దేశాలతోపాటూ మన దగ్గరా వాటికి ప్రత్యేక స్థానం వచ్చింది.

**కె-స్టోర్లూ, రెస్టారెంట్లూ!**

పెద్దపెద్ద షాపింగ్ మాళ్లలో అక్కడక్కడా విదేశీ దుస్తులు కనిపించడం వేరు. కేవలం వాటికోసమే ప్రత్యేక దుకాణాలు ఉండటం వేరు. కొరియన్ నటీనటుల్ని ఇష్టపడటంతోపాటు వాళ్లు వేసుకున్న దుస్తుల్నీ కోరుకుంటున్న టీనేజర్ల కోసం ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాల్లో చాలాచోట్ల కొరియన్ ఫ్యాషన్ పేరుతో విడిగా డ్రెస్సులు దొరుకుతున్నాయి. వీటిల్లో పైనుంచి కింద వరకూ ఉండే కొరియన్ సంప్రదాయ దుస్తులు 'హాన్‌బాక్'తో సహా మినీ-లాంగ్ స్కర్ట్స్, టాప్స్, పానయంట్స్, షర్ట్స్..ఇలా కొరియన్ స్టైల్‌నెక్స్, ప్రింట్లతో బోలెడన్ని డ్రెస్సులు ఉన్నాయి. రెడీమేడ్‌గా ఉన్నవే కాదు. కొన్ని కొరియన్ ఫ్యాషన్ దుకాణాల్లో కె-డ్రామాల్లో కనిపించి, మెప్పించిన డ్రస్సుల్నీ కావాలంటే తెప్పిస్తున్నారు. ఫ్యూజన్ కల్చర్ మొదలయ్యాక అన్ని ప్రాంతాల్లో అన్నిరకాల ఆహారపదార్థాలూ కనిపిస్తున్నాయి. కానీ చాలావరకూ ఒకటో, రెండో ఫేమస్ విదేశీఫుడ్స్ మాత్రమే అందుబాటులో ఉంటే..ఈ కె-క్రేజ్‌తో మాత్రం ఇప్పుడు రకరకాల రుచులతో కొరియన్ రెస్టరంట్లే వచ్చాయి. సలాడ్ రైస్‌తో ఉండే బిబింబప్, క్యాబేజీ-కొరియన్ ర్యాడిష్‌లతో తయారుచేసే కిమ్చీ, కొరియన్ నూడుల్స్..ఇలాఎన్నో రకాల ఫుడ్‌ఐటమ్స్ థీమ్ హోటళ్లూ ఉన్నాయి. ఇంకా రకరకాల కొరియన్ లైఫ్ భారత్‌లో ఎంతలా ప్రభావం చూపుతోంది అంటే బొమ్మల దగ్గర్నుంచి బ్యాగుల వరకూ దొరికే కొరియన్ స్టోర్లతోపాటు పూర్తిగా కొరియన్ వస్తువుల్ని అందించే 'కొరికార్ట్, కొరియన్ మార్కెట్.ఇన్' పేర్లతో ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లూ అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో పౌడర్ దగ్గర్నుంచి వంట పాత్రల వరకూ అన్నీ కొరియన్‌వే ఉంటాయి. కొరియన్ స్కిన్‌కేర్, కె-బ్యూటీఇండియా, కొరియన్ బ్యూటీ ప్రొడక్ట్స్..ఇలా రకరకాల ఇన్‌స్టాగ్రామ్ పేజీల ద్వారా కూడా కె-వస్తువుల అమ్మకాలు జరుగుతున్నాయి. దక్షిణ కొరియా..ఇంచుమించు ఐదుకోట్ల జనాభాతో ఉండే ఈ దేశం-ఇప్పుడు కొన్ని వందల కోట్ల మంది అభిమానుల్ని సంపాదించుకుంది. దేశ సంస్కృతిని విస్తరించుకుంటూ కె-పాప్, కె-నరడామాలతో కొత్త ట్రెండ్‌ను సృష్టించింది. కొరియన్ వేవ్‌గా చెప్పే ఈ ట్రెండ్ 1990లో మొదలై ప్రస్తుతం ప్రపంచమంతా పాకిపోయింది. లాక్‌డౌన్‌లో దొరికిన వెసులుబాటుతో మరింత దూసుకుపోయింది. అది ఎంతలా అంటే కొన్ని కోట్లమంది చందాదారులతో నడుస్తున్న ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ చూసే ప్రతిపదిమందిలో ఆరుగురు కొరియన్ డ్రామాలు చూస్తారట. అందుకే ఇప్పుడు ఇతర భాషలతోపాటూ హిందీ, తెలుగు, తమిళం భాషల్లోనూ ఈ కొరియన్ డ్రామాలు వచ్చేస్తున్నాయి. ❏

# ఫోన్ భద్రంగా..



**ఫోన్‌ను** సురక్షితంగా ఉంచుకోవటానికి అత్యుత్తమైన మార్గం దగ్గరే పెట్టుకోవటం. హోటళ్లకు వెళ్లినప్పుడు పర్సును టేబుల్ మీద పెట్టం కదా. అలాగే బయటకు వెళ్లినప్పుడు ఫోన్‌ను కూడా ఎక్కడపడితే అక్కడ పెట్టొద్దు. వాడనప్పుడు జేబులో గానీ చేతి సంచీలో గానీ పెట్టుకోవాలి. రద్దీ ప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు ఫోన్ మీద ఓ కన్నేసి ఉంచాలి. చవక ఫోన్ అయినా కూడా దీన్ని మరవరాదు. ఒకసారి ఫోన్ పోయిందంటే దానిలోని వివరాలు ఇతరులకు చిక్కినట్టే. ఇది గోప్యతకు భంగం కలిగిస్తుందని మరవరాదు. కుటుంబసభ్యుల్లో, స్నేహితులలో ఇతరులెవరి చేతికి ఫోన్ ఇస్తున్నా యూజర్ ప్రొఫైల్ ఆప్షన్ ఎంచుకోవటం మంచిది. ఇది ప్రతి ఒక్కరికీ తమదైన భద్రత కల్పిస్తుంది. దీన్ని సెట్ చేసుకుంటే కొత్త యూజర్‌ను యాడ్ చేసుకొని ఫోన్‌ను వారికి ఇవ్వచ్చు. వారి ఈమెయిల్ ఖాతా, యాప్స్, ఫోటోస్టోర్ విడిగా ఉంటాయి. ఇలా ఇద్దరి వ్యక్తిగత వివరాలు భద్రంగా ఉంటాయి. ఒకవేళ కొద్ది నిమిషాల వరకే ఎవరికైనా ఫోన్ ఇస్తున్నట్లయితే గెస్ట్‌ప్రొఫైల్‌ను సెట్ చేసుకోవాలి. దీని ద్వారా ఆ సమయం మేరకు ఖాతాను భద్రంగా ఉంచుకోవచ్చు. మొత్తం వ్యక్తిగత డేటా వారి కంటపడకుండా చూసుకోవచ్చు. సెటింగ్స్ ద్వారా సిస్టమ్‌లోకి వెళ్లి..మల్టిపుల్ యూజర్స్ బటన్‌ను ఆన్ చేసుకోవాలి. అనంతరం యాడ్ యూజర్‌ను ఎంచుకొని, కొత్త యూజర్‌కు పేరు పెట్టుకోవాలి. అవసరమైతే ఫొటో జత చేసుకోవచ్చు. ఎవరికైనా ఫోన్ ఇచ్చేటప్పుడు స్విచ్‌యూజర్ మీద ట్యాప్ చేసి సెటప్ నౌ ఎంచుకుంటే సరి. కొన్ని ఫోన్లలో ఈ సెటింగ్ విధానం భిన్నంగా ఉండొచ్చు.

**యాప్ లాకప్:** స్క్రీన్ లాక్ చేసుకోవటమే కాకుండా ముఖ్య మైన యాప్‌లను విడివిడిగా లాక్ చేసుకోవటమూ ముఖ్యమే. ఎవరైనా పాస్‌వర్డ్ తెలుసుకొని ఫోన్‌ను ఓపెన్ చేసినా చేయకుండా ఇది కాపాడుతుంది. ఇందుకోసం ఉచితంగా అందుబాటులో ఉండే యాప్‌లాక్ వంటి సాధనాల సాయమూ తీసుకోవచ్చు. అన్నీ కాకపోయినా ఈమెయిల్, ఫైల్ మేనేజర్ వంటి రహస్య సమాచారంతో కూడిన యాప్‌లను లాక్ చేసుకుంటే నిశ్చింతగా ఉండొచ్చు. కొన్ని పరికరాల్లో ప్రత్యేకించి లాక్డ్ ఏరియా వంటి ఫీచర్లూ ఉంటాయి. వీటిల్లో ముఖ్యమైన యాప్‌లను భద్రపరచుకోవచ్చు. అదనంగా మరో సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాల్సిన అవసరముండదు.

**ఫైండ్ మై డివైస్:** పొరపాటున ఫోన్ పోయినట్టయితే ఇది బాగా ఉపయోగపడుతుంది. ముందుగా సెటింగ్స్‌లోకి వెళ్లి, సెక్యూరిటీ ఆప్షన్ ద్వారా ప్రైవసీలోకి వెళ్లాలి. ఫైండ్ మై డివైస్‌ను ఆన్ చేయాలి. చాలా ఫోన్లలో ఇది ఆఫ్ చేసి ఉంటుంది. దీనికింద ఫైండ్ మై డివైస్, వెబ్, గూగుల్ అనే ఆప్షన్లు కనిపిస్తాయి. ఒకవేళ ఫైండ్ మై డివైస్ ఫోన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోనట్టయితే ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకున్నాక ఓపెన్ చేస్తే గూగుల్ మ్యాప్ మాదిరిగా కనిపిస్తుంది. ఇది పనిచేయాలంటే ఫోన్‌లో లొకేషన్ ఆన్ చేసి ఉంచాలి. అప్పుడే మ్యాప్‌లో ఫోన్ ఉన్నచోటు కనిపిస్తుంది. ఇందులో ప్లేసౌండ్, సెక్యూర్ డివైస్, ఎరేజ్ డివైస్ అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. వీటిల్లో ఎరేజ్ డివైస్ బూడిదరంగులో ఉంటుంది. ఎందుకంటే దీన్ని అదే పరికరం నుంచి ఉపయోగించుకోలేం. వెబ్ లేదా ఇతర పరికరం ద్వారానే ఎరేజ్ చేయటానికి వీలుంటుంది. ఫోన్ కనిపించనప్పుడు లేదా ఎవరైనా దొంగలించినప్పుడు వెబ్ ఇంటర్‌ఫేస్‌తో గుర్తించొచ్చు. ప్లేసౌండ్‌ను ఎంచుకుంటే ఐదు నిమిషాల సేపు ఫోన్ రింగ్ అవుతుంది. సైలెంట్ మోడ్‌లో ఉన్నా, స్విచాఫ్ అయినా కూడా ఫోన్ రింగు అవుతుంది. ఫోన్ దొరికినవారిని హెచ్చరించేందుకు మెసేజ్ కూడా పంపించొచ్చు. స్క్రీన్ లాక్ అయినా వారికి మెసేజ్ కనిపిస్తుంది. ఫోన్‌ను లాక్ చేయాలనుకుంటే 'సైక్యూర్ డివైస్' మీద క్లిక్ చేసి, గూగుల్ ఖాతా నుంచి సైన్ అవుట్ కావాలి. ఇక 'ఎరేజ్ డివైస్' ఆప్షన్‌తో ఫోన్‌లోని సమాచారాన్నంతా డిలిట్ చేయొచ్చు. ఇందుకోసం మళ్లీ సైన్ ఇన్ కావాల్సి ఉంటుంది. ఒకసారి సమాచారం ఎరేజ్ అయితే ఇక ఎప్పటికీ ఫోన్ ఎక్కడున్నదీ గుర్తించలేం.

## గూగుల్‌తో యాప్స్ ధ్రువీకరణ

గూగుల్ ప్లే స్టోర్‌లో ఉన్న అన్ని యాప్‌లను గూగుల్ తనిఖీ చేస్తుంది. ధ్రువీకరిస్తుంది. అయితే కొన్నిసార్లు అధికార స్టోర్‌ల నుంచి కాకుండా ఇతర స్టోర్స్ నుంచి యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తొచ్చు.

ఇలాంటప్పుడు యాప్ వెరిఫికేషన్‌ను ఆన్ చేసుకుంటే ఇన్‌స్టాల్ చేసుకునే యాప్‌లను స్కాన్ చేస్తుంది. వాటిల్లో మాల్వేర్లుంటే హెచ్చరిస్తుంది. ఇందుకోసం సెటింగ్స్ ద్వారా సెక్యూరిటీ విభాగంలోకి వెళ్లి స్కాన్ డివైస్ ఫర్ సెక్యూరిటీ థ్రెట్స్‌ను ఎనేబుల్ చేసుకోవాలి.

**సెక్యూరిటీ యాప్ ఇన్‌స్టాల్:** సహజంగానే ఆండ్రాయిడ్ పరికరాల్లో బోలెడన్ని సెక్యూరిటీ టూల్స్ ఉంటాయి. అయినప్పటికీ థర్డ్‌పార్టీ సెక్యూరిటీ లేదా యాంటీవైరస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవటం మంచిది. అయితే 360 సెక్యూరిటీ, అవాస్ట్ యాంటీవైరస్ అండ్ సెక్యూరిటీ, లుకవుట్ మొబైల్ సెక్యూరిటీ వంటి విశ్వసనీయ యాప్‌లనే ఎంచుకోవాలని మరవొద్దు. ఇలాంటి భద్రమైన యాప్‌లు వైరస్‌లు, మాల్వేర్లను స్కాన్ చేయటమే కాకుండా అంతర్జాలాన్ని చూస్తున్నప్పుడు బ్రౌజర్లనూ స్కాన్ చేస్తాయి.

కథ

# వాయుగుండం

ర్యాలి ప్రసాద్

జనవరి నెల కావడంతో ఏడు గంటలకే అర్ధరాత్రయినట్టుంది. జన సంచారం కూడా అంతగా లేదు. కొత్తపేట మార్కెట్ దగ్గర్నుండి టూటౌన్ సెంటరుకి వచ్చింది పరదేశమ్మ. నెత్తి మీద తట్ట కింద పెట్టుకుని లైన్ ఆటో కోసం ఎదురు చూస్తోంది. అటుగా వెళ్తున్న ఆటోని ఆపి "సొల్లంగెల్తాదా" అనడుగుతోంది.

ఆటోలన్నీ ఎప్పుడూ యానాం వరకు వెళ్లేవి... ఇవ్వాళెందుకో జగన్నాథపురం చారిటీస్ వరకే వెళ్తున్నాయి.

చొల్లంగి అక్కడ్నించి మూడు మైళ్లుంటుంది.

మెల్లగా ముసురు మొదలు కావడంతో చెంగు తల మీద కప్పుకుంది. వర్షం మొదలైంది. షట్టర్ దింపేసివున్న ఫొటో స్టూడియో అరుగు మీదకెక్కి, తట్ట పక్కన పెట్టి నిలబడింది.

ఉరుములు మెరుపులు బాగా పెరిగాయి. కార్లు తప్ప ఆటోలు అటుగా రావడం లేదు. ఎలా వెళ్లాలి? అని ఆలోచించసాగింది. కారులో వెళ్లేవాళ్ల పరదేశమ్మ వాలకం చూసి ఎందుకాపుతారు. కరెంటు కూడా పోవడంతో అంతా చీకటిగా వుంది. షాపులన్నీ మూసేస్తున్నారు. తట్టలోంచి చుట్ట తీసి వెలిగించుకుంది.

అలా గంట గడచిపోయింది.

ఎక్కడో పెద్ద పిడుగు పడిన శబ్దం. ఒక పెద్ద ఖరీదైన కారు వచ్చి ఆగింది.

ఒకతను కిందకి దిగాడు. వయసు ముప్పై పైన ఉంటుంది. కారు దగ్గర్నుండి వర్షంలో తడుస్తూనే పరదేశమ్మ వున్న దగ్గరకొచ్చి నిలబడ్డాడు. సిగరెట్టు తీసి "అవ్వా, అగ్గిపెట్టె వుందా?" అనడిగాడు.

అగ్గిపెట్టె తీసిచ్చింది.


నెమ్మదిగా సిగరెట్ వెలిగించాడు... ఏమీ మాట్లాడలేదు.

"సొల్లంగేవు వెళ్తారా బాబూ" అని అడగాలనిపించింది. అయినా అడగడానికి భయమేసింది. బాగా డబ్బున్న మారాజులా వున్నాడు. అడిగితే ఏమంటాడోనని ఆగిపోయింది.

సిగరెట్ అయిపోయేవరకూ అక్కడే వుండి, మళ్లీ కారు దగ్గరికి వెళ్లబోతూ "నువ్వు ఎక్కడికి వెళ్లాలవ్వా?" అనడిగాడు.

పరదేశమ్మకు ఆ మాట వినగానే ఉత్సాహం వచ్చింది. పరిగెట్టుకుంటూ కారు దగ్గరికెళ్లి "సొల్లంగెల్లాల బాబూ" అంది.

"సరే, నేను యానాం వెళ్తున్నాను. నిన్ను దార్లో దింపుతాను.. ఎక్కు" అన్నాడు.



కాలుస్తున్న చుట్టను వెంటనే అక్కడ పారేసి, తుపుక్కున ఉమ్మేసి తట్టను తనతో పాటు కారులోకి ఎక్కిస్తుంటే అతను కారు దిగి డిక్కీ తెరిచి అందులో పెట్టమన్నాడు.

అలాగే చేసింది. కార్లు రోడ్డు మీద చూడడమేగానీ ఎప్పుడూ ఎక్కలేదు. కార్లో కూర్చున్న తర్వాత అతనే డోర్ దగ్గరకు లాగాడు "వర్షంలో తడిసిపోయావు. తల తుడుచుకో" అని టవల్ చేతికిచ్చాడు. ఎఫ్.ఎమ్‌లో బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం అని చెప్పాక ఏవో వ్యాపార ప్రకటనలు వస్తున్నాయి. అతను ఎఫ్.ఎమ్. ఆఫ్ చేసేసాడు.

కారు నెమ్మదిగా వెళ్తోంది. ముందు అద్దమ్మీద కుండపోతగా నీరు కారుతోంది. వైపర్ నిర్విరామంగా తుడుస్తూనే వుంది.

రోడ్డు మీద అక్కడక్కడా కార్లు తిరుగుతున్నాయి. వాటి లైట్ల వెలుతురు మాత్రమే కనిపిస్తోంది. కారు జగన్నాథపురం ఎమ్.ఎస్.ఎన్. చారిటీస్ దాటింది.

అప్పుడు అడిగాడు "ఈ వయసులో కష్టపడుతున్నావు... నీకు ఎవరూ లేరా?" అని.

"ఓ కొడుకు బాబూ. మిలట్రీలో వుండేటోడు. యుద్ధంలో సచ్చిపోయాడు. ఆడి కొడుకు కూడా మిలట్రీలోనే పంజేత్తన్నాడు".

"ఎక్కడ?"

"కాశ్మీరులో... తమరికి తెల్సా?"

"ఆ.. తెలుసు. నేను ఆ పక్కనే వున్న జమ్మూ ఐ.ఐ.టీలో పని చేస్తున్నాను".

"అలా ఐతే మావోడు అగుపడితే సెప్పండి బాబూ. ఫోనూ సెయ్యడు, ఉత్తరమ్ముక్కా రాయడు. పేనం కొట్టుకుంటాది".

కారు నడుస్తూ వుంది. చొల్లంగి రేవు దగ్గరికి వచ్చింది. పరదేశమ్మ కారు బైటికి చూస్తూ "అల్లా ముందర రెండో రాయిసెట్టుకాడ ఆపండి బాబూ.. ఆ పక్కీదిలోనే మా ఇల్లు".

కారు కొంచెం ముందుకెళ్లిందో లేదో మొదటి రాయి చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది "అమ్మనాతల్లో... ఎంత పనయిపోయేదో దుర్గమ్మతల్లి మనపాల వుంది కాబట్టి బతికిపోయేం బాబూ".

"మరిప్పుడు ఎలా వెళ్లడం"

"ఈ రాత్రేల సెట్టు అడ్డు తీయరు బాబూ..." అంటుండగానే వెనకనున్న పెద్ద మామిడిచెట్టు పెళపెళ శబ్దం చేస్తూ నేలకొరిగిపోయింది. "ఇప్పుడు వెనక్కి వెళ్లడానిక్కూడా దారి లేదు" భారంగా నిట్టూర్చాడతను.

"బాబూ, మీరేటనుకోకపోతే ఈ రేత్రికి మా యింటికాడుండి పొద్దుగాలే సెట్టు తీసాక ఎల్లండి" అంది పరదేశమ్మ.

అతనూ ఆలోచించాడు. అటూ యిటూ ఎటూ వెళ్లే దారి లేదు. రాత్రికి ఇక్కడే వుండాలని నిశ్చయించుకున్నాడు.

"సరే అవ్వా... పద" అన్నాడు.

ఇద్దరూ కారు దిగారు. చిన్న బ్రీఫ్ కేస్ తీసుకుని అతనూ, సినీ పక్కోలో వున్న తట్ట తీసుకుని పరదేశమ్మా వర్షంలో నడుస్తున్నారు. రెండు మలుపులు తిరిగాక చిన్న గుడిసెముందు ఆగి తాళం తీసి "లోపలికి రండి బాబూ" అంది. ఇంటి చూరు చాలా కిందకు వుండడంతో "తలకి దెబ్బ తగుల్తాది బాబూ" అంది.

తలను ఒంచుకుని లోపలికి పరదేశమ్మను అనుసరించాడతను. గూట్లోని చిన్న చార్జింగ్ లైట్ తీసుకుని స్విచ్ వేసింది.

గోడకు నిలబెట్టి వున్న నులకమంచం వేసి "కూసోండి బాబూ" అంది.

గ్యాస్ పొయ్యి వెలిగించి వేడినీళ్లు మరగబెట్టింది. గ్లాసులో పోసి తాగమని యిచ్చింది.

వేణ్నీళ్లు తాగుతుండగా మూటలోంచి బియ్యం తీసి, కొలిచి ఎసరు పెట్టి అతనికి ఎదురుగా కూర్చుంది.

గదిలో ఓ మూలన పెట్టిన తట్టను ముందు పెట్టుకుని అందులోంచి అర గజం పొడవున్న చెక్క, పిడిలేని కత్తిపీట, మేకుమొనలతో నిండిన ఆరంగుళాల చెక్కముక్క, కొన్ని చేపముక్కలు పైన పెట్టింది. అతని వైపు తిరిగి "తవరు నీసు తింటారా బాబూ?" అడిగింది.

"ఆ... తింటాను".

"పండుగప్ప ముక్కలున్నాయి పులుసెడతాను.. తింటారా?"

"తింటాను"

పరదేశమ్మ పని మొదలు పెట్టింది. అల్లం, వెల్లుల్లి, లవంగాలు సన్నికల్లు మీద నూరుతూ దాన్లో ఉల్లిపాయ ముక్కలేసి మళ్లీ నూరింది.

ఆ ఘాటుకి అతని కళ్లల్లో నీళ్లు వచ్చాయి. కళ్లు తుడుచుకుని బ్యాగ్‌లోంచి ల్యాప్‌టాప్ తీసి టైప్ చేసుకుంటున్నాడు.

గోడకు వేలాడుతున్న ఫొటో చూస్తూ "ఇదెవరు అవ్వా?" అనడిగాడు.

"ఈడే బాబూ నా మనవడు. మిలట్రీలో వున్నాడని చెప్పాను గదా".

"మరి నీ కోడలు ఏది?"

"ఆ యమ్మీ లేదు బాబూ. నా కొడుకు కార్గిల్‌కాడ యుద్ధంలో సచ్చిపోయాడు. ఆ టయానికి కోడలు కడుపుతో వుంది. ఈన్ని కని నా సేతిలో ఎట్టేసి, ఆ యమ్మా గుటుక్కుమంది" అంటూ కళ్లు తుడుచుకుంది.

"ఊర్కో అవ్వా...దేశానికి సేవ చేసే అదృష్టం నీ కుటుంబానికి వచ్చింది" అన్నాడతను. ఆవిడలా ఏడుస్తూనే వుంది.

మాట మారుస్తూ "అవ్వా! నువ్వు ఏ ఏ చేపలమ్ముతావు?"

"సేపలమ్మను బాబూ. ఎవరైనా కొనుక్కున్న సేపల్ని సుబ్రం సేసి, ముక్కలు సేసి పెడతాను".

గదిలో ఓ మూలన పెట్టిన తట్టను ముందు పెట్టుకుని అందులోంచి అర గజం పొడవున్న చెక్క, పిడిలేని కత్తిపీట, మేకుమొనలతో నిండిన ఆరంగుళాల చెక్కముక్క, కొన్ని చేపముక్కలు పైన పెట్టింది.
అతని వైపు తిరిగి "తవరు నీసు తింటారా బాబూ?" అడిగింది.
"ఆ... తింటాను" అన్నాడు.

"మరి తట్ట ఏంటి?"

"సేపల్ని ముక్కలు సేయడానికి కావాల్సిన సామాన్లు, నా కేరేజీలు, యింటికొచ్చేపుడు కొనుక్కునే కిరానాలు, కాయగూరలూ ఉంటాయి".

"ఏ ఏ చేపలు చేస్తావేటి?"

చింతపండు పులుసు పిసికి గిన్నెలో పోస్తూ అబ్బో సేలా రకాల సేపలు సేత్తాను.

ఉసికదంత్లు, కొడిపెలు, బుడ్డపర్కలు, జెల్లలు, వాల్గలు, పాపెర్లు, బొచ్చులు, కొర్రమీన్లు, మాగలు, కనల్లు, సందువాలు, చేతిపరిగెలు, ఇలసలు, పండగప్పలు, మోసులు, బొచ్చులు, కొరమీన్లు, గండమీన్లు, గొయ్యంకలు, తాటిగిలసలు, గొరసలు, బేడిసలు, బెత్తుపరిగలు, సొరసేపలు, కానాగదులు, సందువాలు, సావిడాలు, పీతలు, టేకిలు, కవళ్లు, చుక్కపీతలు, పాలబొంతలు, కానా కనుసులు, వంజిరాలు, సవల్లు, సీలావతులు అబ్బో... యింకా సేలా రకాలు సేత్తాను బాబూ... ఆ.. సెప్పడం మర్సిపోయాను మట్టగిడసలు సేయడం సేలా కట్టం బాబూ, సేతికందవు. బుర్ర మీద రాయితో కొట్టినా సావవు. ఇంకోటి తెల్సా... దానికి పట్టినోడు, అమ్మినోడు, కోసినోడు, వండినోడు, తినోవడు కూడా తెలుసంట".

చేపల్లో యిన్ని రకాలుంటాయని యిప్పటి వరకూ తెలీదు. నీకు పేర్లన్నీ బలే గుర్తున్నాయి. వీటిలో పులసలు చాలా రేటు గదా"

"అవును.. ఇలసలే గోదాట్లోకెళ్లి పులసలౌతై బాబూ"

ఈ మాటలు పూర్తయ్యేసరికి ఘుమఘుమలాడుతూ పులుసు

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:**

**నవ్వుల్.. రువ్వుల్,** ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

**sunmagvaartha@gmail.com**

తయారైంది. నేల మీద పీటేసి కంచంలో అన్నం, పులుసూ వడ్డించింది. అలవాటు లేకపోయినా కింద మఠం వేసుకుని కూర్చుని తిన్నాడు.

అద్భుతంగా ఉంది. మొరటు బియ్యమైనా అన్నం రుచిగా నాలుక వదల్లేనంత బాగుందా భోజనం.

కాసేపటికి నిద్ర ముంచుకొచ్చింది. ఎ.సి. లేదు, కుషన్‌పరుపు లేదు, అయినా ఎప్పుడు తెల్లవారిందో తెలీదు.

కళ్లు తెరిచేసరికి ఎరుపూ తెలుపూ కలగలసిన సూర్యకాంతి. వాతావరణమంతా ప్రశాంతంగా వుంది. పరదేశమ్మ కనపడలేదు. దూరంగా వాహనాల రాకపోకలు వినిపిస్తున్నాయి. లేచి బయటకు వెళ్లాడు.

చిన్న చిన్న పిల్లలు కారు చుట్టూ చేరి, దాన్ని ముట్టుకుని సంబరపడిపోతున్నారు.

అతను దగ్గరకు రాగానే పరుగులు తీస్తూ పారిపోయారు.

కారులోని బ్రష్షూ, పేస్టూ తెచ్చుకున్నాడు. నూతిగట్టు దగరికెళ్లి ముఖం కడుక్కుంటుండగా చంకలో బిందెతో నీళ్లు తెచ్చింది.

"లేసారా బాబూ"

"అవునవ్వా.. మొఖం కూడా కడుకున్నాను"

"ఉండండి బాబూ... టీ పెడతాను"

"వద్దులే అవ్వా... నాకలవాటు లేదు"

"కొంచెం పాలైనా తాగండి బాబూ... మా లచ్చమ్మకాడ ఇడ్లీ తెత్తాను"

"వద్దవ్వా...రోడ్డు మీద చెట్లు తీసేసారా?"

"ఆ.. తెల్లారగట్లే తీసేరు బాబు"

"అయితే నేను బయల్దేరతానవ్వా. యానాంలో చాలా పనుంది. మళ్లీ ఈవేళ సాయంత్రం రైలుకి వెళ్లిపోవాలి".

"అయ్యో... ఇయ్యాలకి వుంటారనుకున్నాను బాబూ" అని నొచ్చుకుంది.

జేబులోంచి రెండు ఐదు వందల రూపాయల నోట్లు తీసి పరదేశమ్మకి యివ్వబోయాడు.

"వద్దు బాబూ... వద్దొద్దు."

"పర్లేదు తీస్కోవ్వా" అంటుండగా లోపలికెళ్లి ట్రంకుపెట్టెలోంచి ఒక ఫోటో తీసి, అతనికి చూపిస్తూ "ఈడు నా మనవడు రాజుగాడు బాబూ, మిలట్రీకి ఎల్లిందగ్గర్నుంచి ఆన్ని సూడలేదు. మీకెక్కడన్నా ఆపడితే సెప్పండి బాబూ"

ఫోటో చేత్తో పట్టుకుని పరిశీలనగా చూసాడు.



ఆ ఫోటో వెనక ఏదో అడ్రస్ వుంది. అది కార్గిల్ దగ్గరిది. మడత పెట్టిన వంద రూపాయల కాగితం అతని చేతికిస్తూ "ఆ యడ్రస్సు కాడే నా కొడుకు సచ్చిపోయాడు బాబూ. ఈ డబ్బుల్తో ఆడి సమాధికాడ పూలు పెట్టండి. ఆ ఉపకారం సేసిపెట్టండి" అంది.


"వద్దు" అనబోయి, తన డబ్బుతో పూలు కొంటానని ఆశ పడుతోంది. ఆమెను బాధ పెట్టడం ఎందుకని తీసుకుని జేబులో పెట్టుకున్నాడు.

"అలాగే" నని చెప్పి లాప్ టాప్ బ్యాగ్ చంకన తగిలించుకుంటూ వస్తున్న అతనికి నిన్న రాత్రి మొబైల్లో చూసిన 'తీవ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన భారత జవాన్ రాజు' అన్న విషయం గుర్తొచ్చింది.

బయటి వాతావరణం సద్దుమణిగినా లోపల యింకా కొనసాగుతూనే వుంది.

## మోంటానాలోని రో నది ప్రత్యేకత

ప్రపంచంలోకెల్లా అత్యంత పొడవైన నది ఏది? అని అంటే చాలా మంది టక్కున అమెజాన్ లేదా నైల్ పేరు చెబుతారు. మరి ప్రపంచంలోకెల్లా అతి పొట్టి నది పేరు? అంటే నదుల్లో పొట్టి నదులు కూడా ఉంటాయా అని ఆశ్చర్యం వేస్తుంది.



అమెరికాలోని మోంటానాలో రో నది కేవలం 201 అడుగుల దూరం మాత్రమే ప్రవహిస్తుంది. జెయింట్ స్ప్రింగ్స్, మిస్సోరీ నది మధ్య 61 మీటర్ల దూరం వరకే దీని ప్రవాహం సాగుతుంది. 1989లోనే ఈ నది గిన్నిస్ బుక్‌లోకి ఎక్కేసింది.

అంతకు ముందు ఈ రికార్డు అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలో ఉన్న లింకన్ సిటీలో డీ రివర్ పేరిట ఉండేది. దాని పొడవు 440 అడుగులే. అంటే 134 మీటర్ల అన్నమాట.

అయితే రికార్డు తమ నదికే చెందాలంటూ ఇరు ప్రాంతాలవారు పట్టు బట్టడంతో 2006లో గిన్నిస్ నిర్వాహకులు ఈ కేటగిరీనే ఎత్తేశారట.

కానీ వరల్డ్ అట్లాస్ ప్రకారం రో నదికన్నా చిన్నవైన మరో రెండు నదులు కూడా ఉండటం విశేషం. ఇండోనేసియాలోని తాంబొరాసి నదితో పాటు నార్వేలోని కోవస్సెల్వా నది పొడవు కూడా అత్యల్పంగా 65.6 అడుగులే! అంటే అవి కేవలం 20 మీటర్ల దూరమే ప్రవహిస్తాయట!



నిజంగా ఒక నది 65 అడుగుల దూరం వరకే ప్రవహిస్తుందా? అనే అనుమానం వస్తుంది ఎవరికైనా. అయితే అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం ఒక నది అంటే దానిలో నిరంతర ప్రవాహం ఉండాలి. అందులోని నీరు సముద్రంలో లేదా మరో నదిలోనో చెరువులోనో కలవాలి. సాధారణంగా వాగులు, వంకలు కలిసి సెలయేళ్లుగా ప్రవహిస్తాయి. సెలయేళ్లన్నీ కలిసి నదులుగా మారతాయి. చివరకు నదులన్నీ ఎత్తయిన ప్రదేశాల నుంచి దిగువకు ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తాయి.

సాహిత్యం




జయసూర్య

# కడగండ్ల కడలిలో తెలుగు

**ప్రాచీన కాలం నుండి వింధ్య పర్వత శ్రేణికి దక్షిణంగా వ్యాపించిన జాతి తెనుగువారు. ద్రవిడ భాషలలో తెన్ అంటే దక్షిణం. క్రమేపీ తెనుగు, తెలుగు వాడుకలోకి వచ్చాయి. తెలుగువారుండే దేశంలో భాగం తెలంగాణం అయింది. దాక్షారామం, శ్రీశైలం, కాళేశ్వరం ఈ మూడు ప్రసిద్ధ శివక్షేత్రాలు నెలకొన్న త్రిలింగ దేశమే ఆంధ్ర దేశం.**

టాలెమి అనే గ్రీక్ భూగోళ శాస్త్రజ్ఞుడు క్రీ.శ.150 సంవత్సరంలో భారతదేశ వర్ణనలో, ట్రెలింగాన్‌గా ఉదహరించాడు. భారతావనిలో గంగానది దక్షిణ తీరం నుండి గోదావరి ఉత్తర తీరం వరకు వున్న కళింగ దేశంలోని పలుకుబడి త్రిలింగ పదంగా భాష ఆవిర్భవించిందని చరిత్రకారులు స్పష్టం చేసారు. ప్రాచీన కాలంలోని తలైంగ్ జాతి నివాస భూమిగా తెలుంగు, తెలుగు ప్రసక్తి కూడా వుంది. ప్రాచీన ఆంధ్ర-తెనుగు శబ్దాల పుట్టుకకు బట్టి ఇప్పటి ఆంధ్రజాతి, ఆర్య ద్రవిడ సమ్మేళనం ఏర్పడి వుండవచ్చనే అంశం, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహంలో ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం వివరించారు. దేశీయమైన జౌత్తరాహిక హిందీ, మహారాష్ట్ర వంటి భాషలు, సంస్కృతం వంటి భిన్న భాషా ప్రవాహ సంగమంగా తెలుగు లోకోత్తర శక్తిగల సజీవ భాషగా రూపొందిందని ప్రముఖ విద్వత్కవి నిడుదవోలు వేంకటరావు సోదాహరణంగా నిరూపించారు.

తెలుగు అజంత భాష. అంటే అచ్చులతో అంతమయ్యే భాష. హలంతాలు తెలుగు భాష సహజ స్వభావానికి విరుద్ధమైనా, కలుపుగోలు విలక్షణ సాన్నిహిత్యం వలన అన్య భాషా పదాలను కలుపుకొన్న అజంత భాషగా రూపొందింది. ఇటలీ భాష కూడా అజంత భాషే. ప్రపంచ భాషావేత్త 'నికలోకోంటి' అందుకే మన మాతృభాషా మాధుర్యాన్ని 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా ప్రస్తుతించారు. అత్యంత ప్రాచీనమైన బ్రాహ్మీకి తెలుగు భాషా ప్రభావం వున్నట్టుగా భట్టిప్రోలు, ధాన్యకటక బౌద్ధ మహా చైత్య శిథిలాలలో లభ్యమైన చారిత్రక శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. తెలుగు లిపి క్రీ.పూ. 3,4 శతాబ్దాలనాటి చారిత్రక ఆధారాలున్నాయి. శాతవాహనులు, రాష్ట్రకూటులు, హయహయ, కళింగ, కర్ణాటక రాజ్యాధినేతలు తెలుగు భాషా సుసంపన్నతకు దోహదం చేసారు.




కానీ ఆధునిక కాలంలో తెలివికి సంస్కృతం, కలిమికి ఆంగ్లం, వ్యవహారానికి హిందీలే కాకుండా తమిళం, కన్నడం, ఉర్దూలతో కాపురం చేసిన తెలుగు ప్రత్యేకతను కోల్పోతోంది. అన్య భాషా అవసరం, వ్యామోహం శృతిమించడంతో మన మాతృభాష దుర్దశ, దుస్థితిని ఎదుర్కోవలసి వచ్చింది.

కనీసం 30 శాతం పిల్లలు తమ భాష నేర్చుకోవడం మానేస్తే, ఆ భాష ఉనికి ఇక ప్రమాదంలో పడినట్టేనని యునెస్కో హెచ్చరిక ప్రస్తుత స్థితిగతులను స్పష్టం చేస్తోంది. నుడికారాలు, అచ్చతెనుగు పదాలు కనుమరుగైపోతున్నాయి.

ఆంధ్ర భాషా విశారద తాపీ ధర్మారావు, వ్యవహారిక భాషోద్యమ నేతగా కేవలం 400 తెలుగు పదాలలోనే తెలుగువాడి సుఖదుఃఖాలు, సకల వ్యాపకాలు, వ్యవహారాలు సుఖంగా వెళ్లబోసుకోవచ్చునని, ప్రేమానురాగాలను గాఢంగా వొలకబోసుకోవచ్చని అన్నారు.

తెలుగు భాషలో కనిపించే ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ, కళింగ ప్రాంతాల మాండలికం భాషకు జీవధాతువు అన్నారు మహాకవి కాళోజీ. బడి పలుకుల భాష, పలుకుబడుల భాష రెండు రకాలుగా ఉంటుందన్నారు. "ఏ భాషరా నీది యేమి వేషమురా? / ఈ భాష ఈ వేషమెవరి కోసమురా? / తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు సంకోచపడి యెదవు సంగతేమిటిరా! అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు/సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా... అంటూ కాళోజీ తీవ్రంగా స్పందించారు.

ఎంత నాగరికత కలిగిన జాతి అయినా మాతృభాష వుంటుంది. భాషకు జాతి వల్లా, జాతికి భాషవల్ల గౌరవం వస్తుంది. పంచదార కన్నా, పనసతొనల కన్నా, తేనె మాధుర్యం కన్నా మిన్న అయిన మన తెలుగు ఆదరణ కోల్పోతోంది.

దక్షిణాసియాలో బెలూచిస్థాన్ మొదలు శ్రీలంకదాకా వ్యవహారంలో ఉన్న 26 ద్రావిడ భాషలలో జనాభా పరంగా అత్యధిక సంఖ్యలో భారతీయ భాషలలో ద్వితీయ స్థానం పొందిన తెలుగు ప్రస్తుతం రెండు రాష్ట్రాల భాష అయినా నిర్లక్ష్యానికి గురి అయి మూడవ స్థానానికి లేదా మరింతగా దిగజారడం హృదయ విదారకం. సనాతనులు, అధునాతనలు అయినా తెలుగువాళ్లు, ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా విద్యాధికులైన తల్లిదండ్రులు, తెలుగు భాషా వినియోగంపై చిత్తశుద్ధితో వ్యవహరించాలి. సంస్కృతం, ఆంగ్లం, హిందీ భాషల పెత్తనం తెలుగును హీనపరిచింది.

అధికార భాషగా, బోధనా భాష, రాజకీయ పాలనా వ్యవహారాలలో మాతృభాషకు ప్రాధాన్యతను కేవలం కంటితుడుపు చర్యలతో కాకుండా కార్యాచరణ చేపట్టాలి. శ్రుతి మించుతున్న అన్య భాషా వ్యామోహానికి సంకెళ్లు వేస్తే తప్ప భవిష్యత్కాలంలో తెలుగు బట్ట కట్టే అవకాశాలు కనుచూపు మేరలో లేవు. ✦

# ధర్మసంకటం

యామిజాల జగదీశ్

**“నా** కు వేదిక ఎక్కి మాట్లాడాలంటే ఏమాత్రం ఇష్టం ఉండదు సార్, అయినా ఉన్నట్టుండి ఈయన నాలుగు మాటలు మాట్లాడుతారు అని చెప్పేసారండి” ఓ కార్యక్రమ నిర్వాహకుడు.**

**“అలా చెప్పడంతో నా పరిస్థితి చూసుకోండి...చాలా ఇబ్బందైపోయింది సార్” అన్నారొకరు.**

**మనకు ఓ పని చెయ్యడం ఇష్టం లేదు. కానీ చేసి తీరాలనే పరిస్థితి.. అంటే అటువంటి స్థితినే మనం ధర్మసంకటం అంటాం.**

అయితే అది తప్పంటారు ఓ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు. ఆయన తమిళంలో పెద్ద పండితుడు, పేరు కీరన్.

ధర్మసంకటం అనేదానికి ఆయన ఇచ్చే వివరణ..

మనిషి ఎన్నో ధర్మాలు చేయవలసి ఉంది. అటువంటి కొన్ని సందర్భాలలో ఒకటి కాదని మరొక ధర్మం చేయవలసి వస్తుంది. అటువంటి పరిస్థితులు ఊహాతీతం.

ఆ సమయంలో అతను ఆ రెండు ధర్మాలలో ఏది చెయ్యాలి? అనే ఆలోచనలో పడతాడు. అలాగే ఏది చెయ్యకూడదు? అనే ఇరకాటంలో పడతాడు. ఆ పరిస్థితే ధర్మసంకటం అంటారాయన.

ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

ఇప్పుడు రామాయణం విషయానికి వద్దాం. అందులో దశరథుడికి ఓ ధర్మసంకటం ఏర్పడింది. అది.. ఓ వైపు కైకేయికి ఇచ్చిన సత్యాన్ని కాపాడుకోవడానికి భరతుడిని పట్టాభిషిక్తుడిని చేయాలి.

ఇంకొకవైపు అతని కుల సంప్రదాయం ప్రకారం పెద్దవాడికే పట్టం కట్టాలి. అంటే రాముడికి పట్టం కట్టాలి.

ఇప్పుడు ఏం చేయాలి? సత్యధర్మాన్ని కాపాడాలా? కుల సంప్రదాయ ధర్మాన్ని పాటించాలా?

దశరథుడు ఆలోచనలో పడ్డాడు. ఇదీ ధర్మసంకట పరిస్థితి.

చివరికి సత్యధర్మాన్ని కాపాడాలనే నిర్ణయానికి వచ్చాడు. అయినప్పటికీ అందులో ఓ విచిత్రమేమిటంటే–

దశరథుడు సత్యధర్మాన్ని కాపాడాలనుకున్న ఆ అంశమే అతని కుల సంప్రదాయ ధర్మాన్ని కాపాడింది. ఎలాగో తెలుసా..

తాను పట్టాభిషేకం చేయించుకోవాలన్న ఆలోచనే భరతుడికి రాకుండా చేసింది. అందుకే దశరథుడు ఒకే సమయంలో సత్యాన్ని కాపాడాడు. కుల సంప్రదాయ ధర్మాన్ని కాపాడాడు.

అందుకే, మనకు ఒకే



సమయంలో పలు ధర్మాలు చేయవలసి వచ్చి, వాటిలో ఏ ధర్మాన్ని చేయాలనే సంకటం వస్తే అయోమయంలో పడకూడదు.

సత్యధర్మానికే ప్రథమ స్థానం ఇవ్వాలి. అన్ని ధర్మాల కన్నా సత్యమే ఉన్నతమైంది.

భీష్ముడికి ఓ ధర్మసంకటం ఏర్పడింది.

ఆ సమయంలో ఆయన సత్యానికే కట్టుబడి ఉండాలనే కృతనిశ్చయానికి వచ్చారు.

అది ఏ ధర్మ సంకటమంటే–

జీవితాంతమూ నేను బ్రహ్మచారిగానే ఉంటాను.. అని ఆయన ప్రతిజ్ఞ చేసారు. కానీ ఆయన ఆచార్యులు పరశురాముడేమో(తండ్రికి భయపడి) నువ్వు ఈమెను పెళ్లి చేసుకునే తీరాలి అని అన్నారు.

ఓ వైపు సత్యం, మరోవైపు గురువు గారి ఆజ్ఞ. ఏం చేయాలి? ఆయన సత్యాన్ని కాపాడాలని పట్టుదలగా ఉన్నారు.

అందుకే ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. చివరికి ఏమైంది???

పరశురాముడు ఓడిపోయాడు.

ఈ రోజుల్లో ఈ విషయాన్ని తెలుసుకున్నవారు ఇక మీదట ధర్మసంకటం కలిగితే ఎలా నిర్ణయం తీసుకోవాలి అనే విషయంలో స్పష్టంగా ఉండాలి.

ఈ కాలపు యువకుడొకడు వచ్చాడు... పెళ్లీడు వయస్సు.

“సార్! మా నాన్న విజయవాడలో ఓ అమ్మాయిని చూసారు. గుంటూరులో ఓ అమ్మాయిని చూసారు. నాకేమో ధర్మసంకటంగా ఉందండీ! ఇందుకు మీరే ఓ దారి చెప్పండి” అన్నాడా యువకుడు.

“తమ్ముడూ, ఇందులో గందరగోళమేముందీ? నీకు ఏ అమ్మాయి నచ్చితే ఆ అమ్మాయినే పెళ్లి చేసుకో” అన్నాన్నేను.

అతను కోపంగా చూశాడు నా వంక.

“సార్, మా నాన్న చూసిన అమ్మాయి నాకు కాదండీ... ఆయనకే. అదే నాకు ధర్మ సంకటమండీ!” అన్నాడు. ✦

సింగిల్ పేజీ కథ

# జగమంత కుటుంబం నాది

తాళ్ళూరి లక్ష్మి

**ఈ రోజు నాన్నగారి శత జయంతి. పొద్దుటే గుడికెళ్లి పూజ చేయించి ఇంటికొచ్చాక కాఫీ తాగుతూ సెల్ ఫోన్‌లో వాట్సప్ సందేశాలు చూస్తూ కూర్చున్నాను.**

**నాన్నగారి గొప్పతనం గురించి, నాన్నగారితో వారికున్న అనుబంధం గురించి ఎందరో పరిచయస్తులు, మరెందరో అపరిచితులు పంపిన సందేశాలు చూస్తుంటే మస్తిష్కం స్తంభించిపోయింది.**

ఒక మనిషి మనల్ని వీడిపోయి దశాబ్దాల కాలమైనా ఇంకా ఇప్పటికీ ఇంత మంది గుర్తు పెట్టుకున్నారంటే ఆ మనిషి జీవన సాఫల్యానికి ఇంతకంటే కావాల్సిన నిదర్శనమేముంది అనిపించింది.

అలాగని నాన్నగారు ఏవేవో మహత్కార్యాలు చేయలేదు. ఆయన చేసిందల్లా నా వారు, పరాయివారు అనుకోకుండా మనుషులందరినీ ఒకేలా ప్రేమించడం. తనకున్న దాంట్లోనే ఇతరులకు సహాయం చేయడం. ఉన్నదాంతోనే సంతృప్తిగా జీవిస్తూ ఎప్పుడూ సంతోషంగా ఉండగలగడం.

ఆయన అంత ఆదర్శవంతంగా జీవితం గడపగలిగారంటే అది కేవలం ఆయన ఒక్కరి గొప్పతనమే కాదు. ఆయన ఆదర్శాలకు జీవితాంతం సహాయ సహకారాలు అందిస్తూ, ఎల్లప్పుడూ చేదోడు వాదోడుగా ఉన్న మా అమ్మగారిది కూడా.

ఏ అపరాత్రి వేళ ఏ బంధు మిత్రులొచ్చినా స్వపర భేదం లేకుండా వారందరికీ కావాల్సిన సత్కారాలు చేయడమే కాకుండా వారు ఉన్నన్ని రోజులు ప్రేమాభిమానాలతో చూసుకోవడంలో ఆవిడని మించినవారు మరొకరు ఉండరేమో అనిపించేది. విసుగుదల అనేది ఆవిడ నిఘంటువులో లేదనిపించేది. సాక్షాత్తు అన్నపూర్ణమ్మేనేమో అనిపించేది.

ఆ ఆలుమగల ఆధ్వర్యంలో మా ఇల్లెప్పుడూ నిత్య కల్యాణం పచ్చ తోరణంలా కళకళలాడుతుండేది. ఇంట్లో ఎప్పుడూ కనీసం అయిదారుగురు అతిథులు ఉంటుండేవారు.

మా కుటుంబం సభ్యులు కేవలం అయిదుగురే అయినా మా నాన్నగారు పెద్ద విశాలమైన ఇల్లు అద్దెకు తీసుకోవటంతో, అందులోనూ నివసించేది రాష్ట్ర రాజధాని కావడంతో మా నాన్నగారి అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ల పిల్లలు అందరూ మా ఇంట్లోనే ఉండి చదువుకునేవారు. అందరి బాగోగులు మా అమ్మగారు, బామ్మగారే చూసుకునేవారు.

వారే కాకుండా మా అమ్మగారి తరపు బంధువులు, బామ్మగారి తరపు బంధువులు, మా నాన్నగారి స్నేహితులు ఎప్పుడూ ఏదో ఒక పని మీద మా ఊరొచ్చి మా ఇంట్లోనే దిగేవారు. వారికి ఎటువంటి సహాయం కావలసి వచ్చినా మా నాన్నగారు వెనుకాడకుండా చేసేవారు.



ఇంత మందికి ఆతిథ్యమిస్తున్నా మా నాన్నగారు కానీ అమ్మగారు కానీ ఒక్క రోజైనా విసుగు చెందినట్టు కానీ, అలసిపోయినట్టు కానీ, ఇబ్బంది పడినట్టు కానీ అనిపించేవారు కాదు. పైపెచ్చు ఎవరైనా వస్తే ఎంతో ఆనందించేవారు కూడా.

పిల్లలం కూడా అందరూ కలిసికట్టుగా ఉంటూ పెద్దవాళ్ల పెట్టింది తిని, మా మానాన మేం ఆడుకుంటూ, చదువుకుంటూ ఉండేవాళ్లం. అలాగే బాగా చదువులు అబ్బి పైకి వచ్చాం కూడా.

ఇంట్లో దాదాపు ఇరవై మందిమి ఉంటున్నా అందరి మనసులు విశాలమయినందువల్ల ఇల్లు ఇరుకనిపించేది కాదు.

మా నాన్నగారి మిత్రులొస్తే కూర్చునేందుకు ఒక అర డజను కుర్చీలు తప్పితే ఇంట్లో ఇంకేమీ ఫర్నిచర్ ఉండేది కాదు. అందరం చాపల మీదే కూర్చుని చదువుకునేవాళ్లం. నేల మీదే రాత్రిపూట పరుపులు వేసుకుని అందరమూ ఒకే గదిలో పడుకునేవాళ్లం.

అదే ఈ రోజుల్లో అయితే ఇద్దరు పిల్లలుంటే భార్యా భర్తలకో గది, అన్నకో గది, తమ్ముడికో గది.

పొరపాటున ఎవరైనా అతిథి వస్తే ఇంతే సంగతులు.... నిర్మొహమాటంగా చెప్పేస్తారు ఇంట్లో వసతి లేదని.

అంతేకాదు, ఒక్క అదనపు మనిషి వచ్చినా ఇంటి ఇల్లాలు సతమతమైపోయి పెద్ద రభస చేసేస్తుంది వాళ్లకు భోజనం ఏర్పాట్లు చేయడానికి. ఈ ముభావపు ఆహ్వానాలు భరించలేక అధిక శాతం అతిథులు హోటళ్లలో ఉండి తమ పనులు ముగించుకుంటారు.

ఇక బంధుత్వాలు ఏమి తెలుస్తాయి? ఎలా నిలుస్తాయి?

ఈ ఇరుకు మనసుల అణు కుటుంబపు వ్యవస్థ చూస్తూ మా పాత రోజులు జ్ఞప్తికి తెచ్చుకుంటే ఆ బంగారు రోజుల్లో అటువంటి పుణ్య దంపతుల కడుపున పుట్టి ఆ కమ్మటి జీవితాన్ని అనుభవించిన మేం ఎంత ధన్యులమో కదా అనిపిస్తుంది.

# ఆంధ్రాలో చూడదగ్గ స్థలాలు

షేక్ అబ్దుల్ వాహీం జాని

ఆంధ్రప్రదేశ్ పురాతత్వ స్థలంగా ప్రసిద్ధి చెందిన జ్వాలాపురం గ్రామం కర్నూలు జిల్లా నంద్యాల సమీపంలో ఉంది. జ్వాలాపురం చుట్టుపక్కల సుమారు రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో పురాతత్వ స్థలాలు విస్తరించి ఉన్నాయి. వేల సంవత్సరాల క్రితం జీవించిన ఆదిమానవుల ఆధారాలు ఇక్కడ



లభించాయి. 75,000 ఏళ్ల క్రితం టోబా అగ్నిపర్వత విస్ఫోటనంలో విరజిమ్మిన బూడిద ఇక్కడి జుర్రేరు నదీలోయలో పేరుకుపోయింది. దీని వల్ల వెయ్యేళ్ల పాటు భూమి మంచుతో కప్పబడిందని శాస్త్రవేత్తల అంచనా. ఈ బూడిద ఆకాశంలో దట్టంగా ఏర్పడిన కారణంగా ఆ సమయంలో సూర్యరశ్మి భూమికి చేరకుండా ఉష్ణోగ్రత పడిపోయి భూమండలమంతా చీకటిగా మారిపోయి అనేక జీవరాసులు, జలవనరులు అంతరించిపోయాయి. ఇలా జరగడాన్ని పాపులేషన్ బాటిల్‌నెక్ అంటారు. ఒక రకంగా చెప్పాలంటే భూమిపై మంచు యుగం ఆరంభమైంది. పదేళ్లపాటు ఈ మంచుయుగం కొనసాగింది. తరువాత వర్షాలు పడి ఆ బూడిదంతా భూమిపై చేరడం ప్రారంభమైంది. ఆ బూడిదపై ఏర్పడిన గ్రామమే కర్నూలు జిల్లాలో బనగానపల్లికి సమీపంలో ఉన్న జ్వాలాపురం. టోబా అగ్ని పర్వత విస్ఫోటనం ప్రపంచంలోనే అతి పెద్ద విస్ఫోటనం. అన్ని అగ్నిపర్వత విస్ఫోటనాలకంటే వంద రెట్లు పెద్దదని అనేకమంది శాస్త్రవేత్తలు భావించారు. అప్పట్లో కర్నూలు జిల్లాలో ఉన్న ఆదిమానవులకు ఎటువంటి ప్రమాదం కలగలేదు. ఆ సమయంలో బతికివున్న ఆదిమానవులే ఇప్పటివారి పూర్వీకులని కొందరి అంచనా.

జ్వాలాపురంలో ఏడేళ్లపాటు పురావస్తు పరిశోధనవారు తవ్వకాలు జరిపారు. 2003 నుండి 2010 వరకు ఇక్కడ జరిపిన తవ్వకాలలో అనేకమంది పాల్గొని పరిశోధనలు జరిపారు. వీరు తమ పరిశోధనా ఫలితాలు, తాము కనుగొన్న అంశాల గురించి వివిధ వైజ్ఞానిక పత్రికల్లో ప్రచురించారు. ఈ తవ్వకాల్లో లభించిన కళాకృతులను బళ్ళారిలోని రాబర్ట్ బ్రూస్ ఫ్రూట్ సంగనకల్లు ఆర్కియాలజికల్ మ్యూజియమ్‌లో భద్రపరచారు. వీటిలో రెండూ అషూలియన్ ప్రదేశాలు, 7 మధ్య రాతియుగ ప్రదేశాలు, అనేక పనిముట్లు, 5 కొత్త రాతియుగ ప్రదేశాలు, 3 రాక్ షెల్టర్లు బయట పడ్డాయి.

జ్వాలాపురం ప్రాంతంలో చిత్రించిన అయిదు రాక్ షెల్టర్లను కూడా గుర్తించారు. వీటిలో ఒకటైన జెడబ్ల్యూపి3 షెల్టరుపై విపులమైన పరిశీలనలు జరిపారు. ఇది 20 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల ఎత్తు ఉన్న క్వార్ట్జైట్ బోల్డరు. ఇది జుర్రేరు నదికి ఎడమ వైపున బనగానపల్లె రోడ్డుకు పక్కన జుర్రేరు ఆనకట్ట నుండి సుమారు అర కిలోమీటరు దూరంలో ఉంది. ఈ రాతిపై ఆ కాలంలో నివసించిన కొంత నాగరికత నేర్చుకున్న ఆది మానవులు రంగు రాతితో చిత్రించిన చిత్రాలు ఉన్నాయి. ఇవి వెలిసిపోయినప్పటికీ ఏనుగు, మనుషులు తదితర ఆకారాలను గుర్తించారు. ఈ రాతి పాదం వద్ద జరిపిన తవ్వకాల్లో 38,000 సంవత్సరాల నాటి పనిముట్లు, రాతిపూసలు, ఎముకతో చేసిన ఈటె లభించాయి. అందువల్ల ఆదిమానవులు లక్ష సంవత్సరాల క్రితమే కర్నూలు జిల్లాలో సంచరించినట్లు తెలుస్తోంది. జ్వాలాపురం వద్ద లభించిన ఆధారాల వలన కొత్త అంశాలు వెలుగులోకి వచ్చాయి. విస్ఫోటనానికి ముందు అషూలియన్ పనిముట్ల విస్తారంగా లభించడాన్ని బట్టి ఆధునిక మానవుడు 75,000 ఏళ్లకు ముందే ఆఫ్రికా నుండి భారతదేశాన్ని చేరుకున్నాడనీ, టోబా విస్ఫోటనం తరువాత కూడా అతని ఆవాసాలు కర్నూలు ప్రాంతంలో కొనసాగాయని తెలుస్తోంది.

## అపూర్వ శిలాతోరణం

తిరుమల శ్రీవారి ఆలయానికి ఉత్తర దిశలో ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న శిలాతోరణం మన దేశంలోనే కాక యూరప్, ఆసియా ఖండాలలో సైతం అద్వితీయమైనది. సహజసిద్ధంగా ఏర్పడిన ఇటువంటి శిలాతోరణాలు ప్రపంచంలో మరో రెండు ప్రదేశాలలో ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాలోని ఉటా ప్రాంతపు ఇంద్రధనుస్తోరణ శిలా సేతువు, ఇంగ్లండులోని డార్డాడియన్‌లో స్ఫటిక శిలా సేతువు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ శిలా తోరణాలు లక్షలాది సంవత్సరాల ప్రాచీన చరిత్రను కలిగివున్నాయని శాస్త్రవేత్తలు తమ పరిశోధనల్లో తేల్చి చెప్పారు.

ఎన్నో ప్రకృతి వైపరీత్యాలకు ఏళ్ల తరబడి ఎదురొడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని శిలాతోరణం ప్రకృతి చిత్ర విచిత్రాలలో ఒకటిగా నేటికీ నిలిచి వుంది.



జీవం ఉట్టిపడే ఈ శిలాతోరణం చాలా ప్రాచీనమైనది. ధనస్సు ఆకారంలో ఉండే శిలాతోరణాన్ని 1980వ దశకంలో శాస్త్రవేత్తలు గుర్తించారు. సముద్ర మట్టానికి 30 వేల అడుగుల ఎత్తులో ఈ శిలాతోరణం ఏర్పడింది. శిలాతోరణం జీవుల తొలి స్థావరంగా కూడా కథనాలు ఉన్నాయి. ఆదిమానవులు రాతిపై చెక్కిన చిత్రాలుగా చెబుతున్నవి ఇక్కడ కనిపిస్తాయి.

## బెలూం గుహలు

మేఘాలయలోని క్రెమ్ లియాట్ ప్రాహ్ తర్వాత భారతదేశంలోని రెండవ పొడవైన గుహలుగా



ప్రసిద్ధి చెందిన బెలూం గుహలు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలం సమీపంలో బెలూం గ్రామంలో ఉన్నాయి. భారతదేశంలోనే పొడవైన అంతర్భాగ గుహలుగా బెలూం గుహలు ప్రపంచ ప్రసిద్ధి గాంచాయి. రమారమి 23 ఎకరాల విస్తీర్ణంలో సాగు భూమి లోపల, భూమికి సమాంతరంగా ఇక్కడ గుహలు ఏర్పడటం ప్రత్యేకత. భూగర్భంలో వింత అనుభూతులను కలిగించే విచిత్ర లోకం బెలూం గుహలు. బెలూం గుహలలో క్రీ.పూ.4,500 సంవత్సరాల నాటి మట్టి పాత్ర లభించాయి. వీటిని విదేశీ అన్వేషకులు కనుగొన్నారు. నాటి మట్టి పాత్రలో మనిషి అస్థికలు, రాతి కత్తి లభ్యం కావడంతో ఈ గుహలను ఆనాటి మానవులు నివాస స్థలాలుగా వినియోగించుకున్నట్లు పరిశోధకుల అభిప్రాయం.

జర్మన్‌కు చెందిన గుహాన్వేషకులు హెర్బర్ట్ డేనియల్ గేబర్, సిబిల్ట్ వోల్ఫ్‌గ్రామ్, నికోల్ బౌలీయర్, ఆంధ్రూ మేబిల్, క్లాడీ చాబర్ట్ ఇత్యాదివారు 1982లో బెలూం గుహ సొరంగాలను పరిశీలించి దీన్ని వెలుగులోకి తెచ్చారు. క్రీ.శ.1884వ సంవత్సరంలో రాబర్ట్ హెచ్‌బీ పూటే అనే ఆంగ్లేయుడు బెలూం గుహల ఉనికిని ప్రపంచానికి తెలియజేశాడు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖవారు ప్రకృతిని ఏమాత్రం ఛిద్రం చేయకుండా అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. 1999వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖవారు బెలూం గుహలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. 2003వ సంవత్సరం నుండి బెలూం గుహల సందర్శనకు పర్యాటకులను అనుమతిస్తున్నారు.

ఇక్కడ నలభై అడుగుల ఎత్తయిన బుద్ధ విగ్రహం బయట పడింది. చాలా కాలం క్రితం గుహల లోపల బౌద్ధ సన్యాసులు ఉన్నారనేదానికి ఇది సాక్షీభూతంగా చెప్పవచ్చు.

బౌద్ధసన్యాసులకు ఇది ముఖ్యమైన ధ్యాన ప్రదేశంగా నిరారిస్తుంది. ఇక్కడ సున్నపురాయి నిల్వలు ఉండటం వల్ల పొరలుగా ఏర్పడి శిలాజాలంతో జరిగిన రసాయనిక ప్రక్రియ వల్ల కొన్ని లక్షల ఏళ్ల క్రితం బెలూం గుహలు ఏర్పడి ఉంటాయని భూగర్భ పరిశోధకుల అంచనా.

## అరుదైన చిన్న మసీదు

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు నగరంలో 400 సంవత్సరాల నాటి అతి చిన్న మసీదు ఉంది. ఇది 3.0 అడుగుల పొడవు, 5.0 అడుగుల ఎత్తును కలిగి వుంది. తోరణాలు, మీనార్లతో విలక్షణంగా కనిపించే ఈ మసీదు కుతుబ్షాహీ నిర్మాణ శైలితో రాతితో నిర్మించారు. దీనిని ఏక స్తంభ మసీదు అని కూడా పిలుస్తారు. ఇది చాలా ప్రాచీనమైనదని 1531 మార్చి 20 నాటి కుతుబ్షాహీ-ఉల్-ముల్క్ మల్కాపురం (ఇబ్రహీంపట్నం) శాసనం ద్వారా ధృవీకరించడం జరిగింది.

## ఉండవల్లి గుహలు

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మంగళగిరి నుండి విజయవాడ వెళ్లే దారిలో, తాడేపల్లి మండలంలోని ఉండవల్లి గ్రామంలో ఈ గుహలున్నాయి. క్రీ.శ.2 లేక 3 శతాబ్దాలలో, విష్ణుకుండిన రాజుల కాలంలో ఈ గుహలను చెక్కారని చరిత్ర చెబుతోంది. భారతదేశంలో అజంతా వంటి అనేక శిల్పకళలతో విరాజిల్లే గుహలు, గుహాలయాలను మూడు అంతస్తుల వరకు మాత్రమే నిర్మించారు. వాటికి భిన్నంగా ఉండవల్లి గుహాలయాలు నాలుగు అంతస్తులలో నిర్మించడం విశేషం. మొదటి అంతస్తు బయట ఋషులు, సింహాల విగ్రహాలున్నాయి. పైకి వెళ్తున్నకొద్దీ చిన్నవైన ఈ గుహలు పైన ఖాళీగా వున్నాయి. కింద అంతస్తులో బౌద్ధ తాపసులు, బౌద్ధ భిక్షువులు కూర్చునేందుకు వీలుగా స్తంభాల మండపం ఉన్నది. గుహాలయాల నుండి కొండవీటి కోటకు, మంగళగిరి కొండకు, విజయవాడ కనకదుర్గ ఆలయానికి 9 కి.మీ. మేర రహస్య మార్గాలున్నాయంటారు. పూర్వం ఈ మార్గాల గుండా రాజులు శత్రు రాజులకు తెలియకుండా తమ సైన్యాన్ని తరలించేవారట. ప్రస్తుతం ఈ సొరంగ మార్గం మూతబడి వుంది.

ఈ గుహలలోని ఒక అంతస్తులో 25 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పు గల ఏక శిలతో శయన స్థితిలో వున్న అతి పెద్ద అనంత పద్మనాభ స్వామి విగ్రహం పరమాద్భుతంగా శిల్పీకరించారు. ఇలాంటి వింతలు ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా అనేకం ఉన్నాయి.



# అజ్ఞానం ఎంత అదృష్టమో!

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

“అడిగేవాడికి చెప్పేవాడు లోకువ” అన్నారు. ప్రశ్నలు అడగడంలోని ఆనందం సౌలభ్యం, సమాధానాలు చెప్పడంలో వుండదు.

ఎందుకంటే మొదటిది చాలా తేలిక. రెండవదే చాలా కష్టం. “నిజానికి తనకు ఏమీ తెలియదు అనుకోవడమే ఒక జ్ఞానం. అదే అసలైన జ్ఞానం” అన్నాడు జనక మహారాజు.

ఎంత నిజం వుంది ఈ మాటలో.

అన్నీ నాకే తెలుసు.. అనుకోవడం ఒక భ్రమ. ఆలోచించి చూస్తే ఎవరైనా ఏదైనా అడిగారనుకోండి.. అయ్యో నాకు తెలియదే... అనడం ఒక పెద్ద రిలీఫ్.

కొందరుంటారు.. మనం వారి ప్రశ్నకు సమాధానం



చెప్పామనుకోండి– వెంటనే మరో ఉప ప్రశ్న వేస్తారు. దానికి సమాధానం చెబితే వెంటనే మరోటి రెడీగా అడిగేస్తారు

మనం చివరకు “ఏమోనండీ! మరీ...” అనేవరకూ వదిలితే ఒట్టు. చిన్నతనంలో మా నాన్న “నీ మొహం.. నీకేమీ తెలియదు” అంటూ తిట్టేవారు.

ఇక పెళ్లయ్యాక భార్య కూడా ఇలాగే అడిగిందనుకోండి.. వెంటనే సేఫ్‌గా నాకు తెలియదోయ్ అన్నారనుకోండి ఆవిడ ఇంతై అంతై ఉబ్బి తబ్బిబ్బైపోతుంది.... తనకే అంతా తెలుసు అన్నట్లుగా.

జ్ఞానం పెరిగేకొద్దీ జీవితం ఒక పెద్ద కాంప్లికేటెడ్ వ్యవహారమే సుమా!

మనం పుట్టినప్పుడు ఆలోచించి చూస్తే అజ్ఞానంతో పుట్టాం? ఏమీ తెలియదు. బ్లాంక్ హెడ్ కదా! ఆకలేస్తే ఏడవడం తప్ప అప్పుడు తెలిసింది ఏమీ లేదు. తర్వాతర్వాత ఎదుగుతున్నకొద్దీ ప్రాబ్లమ్స్ మొదలవుతాయి. వయస్సు పెరిగేకొద్దీ జ్ఞానం పెరుగుతుంది. దాని వెంటే అహంకారం, అసూయ, కొసరుగా కోపం కూడా వచ్చేస్తాయి.

మనకు తెలియనిది ఎవ్వరికీ తెలియదు అనుకోవడంలో భలే మజా వుంది. కానీ మనకు తప్ప అందరికీ అన్ని విషయాలు తెలుసు.. అని తెలిస్తే అంతకన్నా నరకం మరొకటి వుండదు.

అజ్ఞానంలోని ఆనందాన్ని అనుభవించే వారిని మనం ఏమందాం? అదృష్టవంతులమందామా? అజ్ఞానం అనే మాటను మనం తీసిపారెయ్యరాదు. ఒక విధంగా అదే మన ప్రగతికి మూలం. కొత్తది ఏదైనా తెల్సుకోవాలంటే అదే అన్నింటికీ మూలమట. నేర్చుకోవాలనే దుగ్ధ మనిషికి ఉండాలి. అంటే మనకు ఇదేదో తెలియదు అన్న విషయాన్ని ముందు అంగీకరించాలి. మనకు అర్థం కాకపోవడమే ఒక విధంగా తెలుసునన్న స్థితికి చేరే విధంగా సహాయపడుతుంది. ఇక్కడ కొందరు అతి తెలివితేటల్ని ప్రయోగిస్తారు.

ఒకసారి ఒక గురువుగారి ముక్కుపొడుం డబ్బా కనిపించకుండా పోయింది. అంతా వెతికారు.. కనిపించలేదు.

అందరూ నేను చూడలేదంటే.. నేను చూడలేదన్నారు.

అంతలో ఒకడు లేచి “గురువుగారూ! అది ఇంతుంటుంది!” కదండీ” అన్నాడు.

“అవునురా” అన్నాడు గురువు.

ఒక రోజున మీకు కనిపించకపోతే నేను దేవులాడి ఇచ్చాను కదండీ!”

“అవునురా బాబూ. ఎక్కడ?” అని గట్టిగా అడిగారు గురువు.

“ఎక్కడుందో చెప్పరా బాబూ” గురువు గారికి సహనం పోయింది.

“ఏమోనండీ! నాకు తెలియదు” అంటూ చెప్పి తాపీమని కూర్చున్నాడు.

మరి ఇలాంటివారు కూడా జీవితాల్లో తారసపడుతూ వుంటారు. దాన్ని అతి తెలివితేటలు అందామా?

ఇక మా ఇంట్లో మనవడు ఒకడున్నాడు. వాడు ఇప్పుడిప్పుడే పెద్ద క్లాసులోకి ప్రవేశించాడు. ఎన్నో కొత్త విషయాలను తెలుసుకుంటూ వున్నాడు. వాడికి అవన్నీ తనకే తెల్సు నన్న అభిప్రాయం. వాడు అప్పుడప్పుడూ అడుగుతూ వుంటాడు.. “తాతయ్యా! ఇది నీకు తెల్సు నా?” అని.

వెంటనే నేను “తెలియదురా” అనాలి.

వాడికి ఎంత సంతోషమో! దాన్ని గురించి ఒక చిన్న లెక్చర్ ఇస్తాడు. అప్పుడు మనం “థాంక్స్ రా” అన్నామనుకోండి.. ఇక వాడి ఆనందానికి అవధులుండవు. ఇదిగో ఈ పాయింట్ ఆధారంగానే ఈ మధ్య ఎన్నో చానల్స్, సెల్‌ఫోన్ నెట్‌వర్క్‌లు కోట్లు సంపాదిస్తున్నాయంట.

ఇక పార్కుల్లో వాకింగ్‌కు వచ్చిన కొందరు మహానుభావులు వారికి తెల్సినదంతా కక్కేస్తూ వుంటారు. ఎదుటివాళ్లకు ఆసక్తి ఉందా, లేదా అనేది వారికి అనవసరం. వారికే గొప్పగా ఏదో తెల్సు నన్న ఫోజు. కొందరు అత్తలూ అంతే. ఈనాటి కోడళ్ల బాగా చదువుకున్నవారు, నాలెడ్జ్ విపరీతంగా వున్నవారన్న విషయాన్ని పట్టించుకోరు. తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవడం కోసం ప్రతి చిన్న విషయంలోనూ కల్పించుకుని మరీ చెప్పేస్తూ ఉంటారు. ఇక ఆ కోడళ్ల పరిస్థితిని ఊహించుకుంటే బాధేస్తుంది.

అందుకే మిత్రమా! తెలిసిందేదో తెలిసింది.. నాకు తెలియనిది ఏదో నాకు తెలియదు.. అనుకుని సరిపెట్టుకుంటే పోలా! నాకేమీ తెలియదు, నేను అజ్ఞానిని అనుకుంటే అంతకన్నా వినయం ఏముంటుంది?

# సెల్లార్ పైకప్పు ఎంత ఎత్తులో ఉండాలి?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

**3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్**

**సెల్: 9885446501/9885449458**






**కె.సుబ్రమణ్య – కందుకూరు**

**ప్రశ్న: సెల్లార్ పైకప్పు ఎలా ఉండాలి? ఎక్కువ ఎత్తులో ఉండాలా? తక్కువ ఎత్తులో ఉండాలా?**

**జవాబు:** సెల్లార్ పైకప్పు అంటే గ్రౌండ్ ఫ్లోర్ భూమి లెవెలు కంటే ఎక్కువ ఎత్తులోనే ఉండాలి.

## చిక్కులను అధిగమించేదెలా?

**సి.శారద – విజయనగరం**

**ప్రశ్న: మా గృహం 'ఎల్' ఆకారంలో ఉంటుంది. చాలా చిక్కులు ఎదురవుతున్నాయి. ఈశాన్యం మూల ఖాళీ లేదు. గోడ కట్టేసారు. చేయాల్సిన మార్పులు సూచించండి.**

**జవాబు:** 'ఎల్' ఆకారపు కట్టడాల్లో నాలుగు రకాలున్నాయి. దక్షిణ, పశ్చిమాలుగా 'ఎల్' ఆకారంలో కట్టడం మంచిది. మిగతా మూడు రకాలు చెడు ఫలితాలనిస్తాయి. దక్షిణ, పశ్చిమాలుగా వ్యాపించకుండా మరేవిధమయిన 'ఎల్' ఆకారపు కట్టడం వున్నా సవరించుకోవడం ఉత్తమం.

## ఏ దిక్కులో స్థలం కొనాలి?

**ఎ.ప్రవల్లిక– హైదరాబాద్**

**ప్రశ్న: నా పేరుతో స్థలం/ఇల్లు కలిసొస్తుందా? ఇప్పుడున్న ఇంటికి ఏ దిక్కులో కొనుక్కుంటే బాగుంటుంది?**

**జవాబు:** పేరునుబట్టి కొనాల్సిన స్థల నిర్దేశం ఏదీ వుండదు. ప్రస్తుతం వున్న ఇంటికి తూర్పు, ఉత్తర లేదా ఈశాన్య దిక్కులలో మీరు కొత్తగా కొనే స్థలంగానీ, ఇల్లుగానీ వుండాలి. ఆ స్థలానికి లేదా ఇంటికి ఈశాన్యం పెరిగి వుంటే మంచిది. తూర్పున కొనే స్థలానికి తూర్పు ఈశాన్యం పెరిగి వుండడం, ఉత్తర ఈశాన్యం పెరిగి వుండడం శ్రేష్ఠం. ఈశాన్యం వైపు కొనే స్థలానికి ఏదైనా ఒక ఈశాన్యం తప్పకుండా పెరిగి వుండాలి.

## వాస్తు దోషాలున్నాయా?

**సిహెచ్.కళాధర్ – నాయుడుపేట**

**ప్రశ్న: చాలా రోజుల క్రితం ఒక పురాతన గృహాన్ని కొని డాబా వేసాం. ప్రతివారు మా ఇల్లు చూసి ఇంట్లో వాస్తు దోషం వుంది, ఈ ఇంట్లో వున్నవారికి సమస్యలు తప్పవు.. అంటున్నారు. మేం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఏ పని మొదలు పెట్టినా ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఆరోగ్య సమస్యలున్నాయి.**

**జవాబు:** పాత ఇళ్ల విషయంలో ప్లాన్ వలన ఉపయోగం వుండదు. మీ ఇల్లు వాస్తు నిపుణులకు చూపించండి. అవసరమైన మార్పులు సూచిస్తారు.

## ఎలాంటి మార్పులు చేయాలి?

**బి.వాసుదేవరావు – కనిగిరి**

**ప్రశ్న: మా ఇంటి ప్లాను చూసి చేయాల్సిన మార్పులు తెలుపగలరు.**

**జవాబు:** మీ ఇంటి ముందు తూర్పున మూడు వీధుల కలయిక వుండి రెండు దారులు ఒకటి తూర్పు ఈశాన్యం వైపుకు, మరొకటి తూర్పు ఆగ్నేయం వైపుకు క్రాస్‌గా వెడుతున్నాయి. చెడు ఫలితాన్నిచ్చే తూర్పు ఆగ్నేయ వీధిపోటు కూడా వుండడం వలన తూర్పు ఈశాన్యం వీధిపోటువల్ల రావలసిన మంచి ఫలితాలు పూర్తిగా మీరు పొందలేకపోతున్నారు. తూర్పు ఆగ్నేయ వీధిపోటును నియంత్రించడం వల్ల ఆ వీధిపోటు వల్ల వస్తున్న చెడు ఫలితాలు తగ్గిపోవడమే కాక తూర్పు ఈశాన్య వీధిపోటు వలన వచ్చే మంచి ఫలితాలు త్వరలో కనిపిస్తాయి.

## ప్లాట్‌ఫాం ఏ దిక్కులో?

**కె.కార్తిక్ – సాలూరు**

**ప్రశ్న: ప్లాట్‌ఫాం ఏ దిక్కులో ఉండాలి?**

**జవాబు:** మీరు కిచెన్‌ని వాయవ్య బెడ్ రూమ్ స్థానంలోకి మార్చుకుని ఆ గదిలో ఆగ్నేయ మూల తూర్పుకు అభిముఖంగా వంట చేసే విధంగా ప్లాట్‌ఫాం కట్టుకోవాలి. స్లాబు నుండి ఉత్తర వాయవ్యంగా బయటకు పెరిగిన టాయ్‌లెట్, బాత్‌రూమ్‌లను తీసేసి వంటగదిని అక్కడి వరకు పెంచుకుని స్లాబ్‌ని ఎగుడు దిగుడుగా కాకుండా చతురస్రంగా మలుచుకోవాలి. నైరుతి మెట్లు కూడా ముందు ఉత్తరానికి ఎక్కి, ఆ తరువాత దక్షిణానికి ఎక్కేలా వున్నాయి. అలా వుండకూడదు. ముందు దక్షిణానికి ఎక్కి, తర్వాత ఉత్తరానికి ఎక్కేలా నిర్మించుకోవలసి ఉంటుంది.

## సింహద్వారం ఈశాన్యంలో?

**సి.నారాయణి – ఖమ్మం**

**ప్రశ్న: మా స్థలంలో ఇంక్‌తో మార్కు చేసిన స్థలంలో ఇల్లు వస్తుంది. మా ఇంటి స్థలానికి ఉత్తర ఈశాన్యంలో ప్లాన్‌లో చూపించిన విధంగా వీధిపోటు వున్నది. అది మంచిదా? కాదా? కాంపౌండ్ వాల్ గేటు, ఇంటి సింహద్వారం ఉత్తర ఈశాన్యంలో పెట్టుకోవచ్చా?**

**జవాబు:** ఉత్తర ఈశాన్య వీధిపోటు మంచిదే. ఉత్తర ఈశాన్య గేటు సింహద్వారం కూడా మంచివే. కానీ మీ స్థలానికి దిక్కులు సరైన విధంగా లేక దిక్‌మూఢం ఏర్పడి వుండవచ్చని మీ ప్లాను ద్వారా తెలుస్తోంది.

అదే నిజమైతే అప్పుడు వీధిపోటు సరిగ్గా ఉత్తర ఈశాన్యంలోకి వస్తుందో, రాదో ప్రత్యక్షంగా చూస్తేగానీ కచ్చితంగా నిర్ణయించలేం. ఆ వీధిపోటు ఉచ్ఛ స్థానంలో వుంటే మంచిదే. కానీ నీచ స్థానంలో వుంటే చాలా చెడు ఫలితాలుంటాయి. అప్పుడు దాన్ని సవరించవలసి ఉంటుంది. వాస్తు నిపుణులకు చూపించి మీ సందేహం నివృత్తి చేసుకోవడం మంచిది. ✦

# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



దీర్ఘకాలిక ఆశయాలను నెరవేర్చుకోవడానికి కీలక స్థానాలలో ఉన్న వ్యక్తులతో సంభాషణలు సాగిస్తారు. శతృవర్గం బలహీనతలు తెలుసుకొని నేర్పుగా వ్యవహరిస్తారు. అనుకూలమైన వాతావరణం నూతనోత్సాహం ఇస్తుంది. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెంపొందుతాయి. రాజకీయాల పట్ల ఆసక్తి చూపుతారు.

## వృషభం



ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. కుటుంబ వాతావరణం ఉత్సాహపూరితంగా ఉంటుంది. ఉన్నత స్థాయి వ్యక్తులతో స్నేహాలు మరింత బలపరచుకునే ప్రయత్నాలు చేస్తారు. సమీప బంధువులను కలుస్తారు. భవిష్యత్ ప్రణాళికల గురించి చర్చించి, అధికంగా లాభం వచ్చే స్వల్పకాలిక వ్యాపారాలలో ధనాన్ని మదుపు చేస్తారు. చేతికి కుబేర కంకణం ధరించండి.

## మిథునం



దేవాలయాలు సందర్శిస్తారు. పక్షులకి దానం వేయండి. వ్యాపార లావాదేవీలు అనుకూలం. బాధ్యతలు పెరిగినా సకాలంలో పూర్తి చేస్తారు. ముఖ్య వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ముఖ్యమైన సమస్యలు పరిష్కారమవుతాయి. జీవిత భాగస్వామి సహాయ సహకారాలు అందుకుంటారు. సంఘ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## కర్కాటం



వ్యాపార లావాదేవీలు బాగుంటాయి. తల్లిదండ్రులు, ఇంట్లోని పెద్దలకు కావలసిన అవసరాలు సకాలంలో తీర్చి మానసిక ప్రశాంతత పొందుతారు. వ్యక్తిగత విషయాలకు ప్రాముఖ్యం ఇస్తారు. కొనుగోళ్లకు అధికంగా ధనం ఖర్చు చేస్తారు. కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుని, వాటిని అమలు పరుస్తారు.

## సింహం



ఒర్పు అధికంగా కలిగి ఉంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. నూతన వ్యక్తులతో పరిచయాలు దీర్ఘకాలిక మిత్రత్వానికి దారి తీస్తాయి. శ్రమకు తగిన ప్రతిఫలాలు అందుకుంటారు. యోగాభ్యాసం, ప్రకృతి వైద్యం ఆకర్షిస్తాయి. గృహ సంబంధిత ఖర్చులు అధికం అవుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో సొంత నిర్ణయాలు తీసుకోండి.

## కన్య



నిపుణుల సలహాలు పాటించి లాభపడతారు. సమృద్ధికరమైన ఆర్థిక వనరులు సంతోషానికి కారణం అవుతాయి. సన్నిహితుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు. పూజలలో ఆరావళి కుంకుమ ఉపయోగించండి. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. విలువైన వస్తువుల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండండి.

## తుల



రాజకీయాల గురించి ధనం ఖర్చు అవుతుంది. ఆర్థికంగా బాగుంటుంది. పక్షులకి దాన వేయండి. ప్రజా సంబంధాలను బలపరచుకోవడానికి మరింత శ్రమిస్తారు. అనుకూల ఫలితాలను సాధిస్తారు. గతంలో చేజారిన అవకాశాలు ఇప్పుడు అందివస్తాయి. శుభ పరంపరగా ఉంటుంది. ఉద్యోగులకు తాత్కాలిక బదిలీ అవకాశాలున్నాయి. కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పాడితో అభిషేకం చేయండి.

## వృశ్చికం



ముఖ్యమైన వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. దూర ప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. సంఘంలో ఆదరణ పొందుతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి. కొనుగోలు, అమ్మకాలకు ఎక్కువ సమయం కేటాయిస్తారు. ఆరోగ్య సూత్రాలు క్రమ పద్ధతిలో అమలు పరచాలని నిర్ణయించుకుంటారు. వినోద కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటారు. సౌర కంకణం ధరించండి, ఆరోగ్యం మెరుగవుతుంది.

## ధనుస్సు



ఊహించని ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. దీర్ఘకాలిక సమస్యలు కొంతవరకు తీరుతాయి. బంధువుల ద్వారా ధన, వస్తు లాభం పొందుతారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. క్రయ, విక్రయాలలో లాభాలు పొందుతారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి.

## మకరం



సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. మానసిక ఒత్తిడి నుండి బయట పడతారు. సంతాన విద్యా విషయ వ్యవహారాల పట్ల ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. కాంట్రాక్టులు దక్కుతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వృత్తి, వసారాలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాల్లో నూతన వ్యక్తులు పరిచయమవుతారు. ఉద్యోగస్తులకు స్థాన మార్పులు ఉంటాయి. చేతికి కుబేర కంకణం ధరించడం మంచిది.

## కుంభం




నూతన ప్రదేశాలు సందర్శిస్తారు. అన్ని విషయాలలో భద్రతకు సంబంధించి జాగ్రత్తలు తీసుకోవడం చెప్పదగిన సూచన. ముఖ్యమైన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి మంచి పేరు ప్రఖ్యాతులు సాధిస్తారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. పనుల్లో ఆలస్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. కార్య ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు.


## మీనం




గృహోపకరణ సామాగ్రిని సమకూర్చుకుంటారు. బంధువులు, శ్రేయోభిలాషులతో ఇష్టాగోష్టి సాగిస్తారు. అనుకూలమైన వాతావరణంలో ఆనందంగా కాలం గడుపుతారు. రాజకీయాల గురించి ధనం ఖర్చు చేస్తారు. తాత్కాలిక ఉద్యోగ బదిలీ అవకాశాలున్నాయి. కొత్త పనులు స్వీకరిస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. ప్రయాణాలలో నూతన వ్యక్తులు పరిచయమవుతారు. ఆలయాలు సందర్శిస్తారు.

# ఈ వారం కా'ర్టూన్స్'


మరీ అంత సబ్మిసివ్ గా అయితే కార్టూన్లు వేయడం ఎందుకు.. వెళ్లి భజనే చేస్కో!!
-ఎడిటర్-
Zakir


బంగారాలు, కార్లు, నగలు కొనిస్తా అన్నవ్.. ఒక్క వెయ్యి క్యాష్ అడిగితే పారిపోతున్నవేం?!
Zakir...


ఆ టీం కు రాజీనామా చేసి ఈ టీం కు ఆడుతావా? పొలిటికల్ ఫ్యామిలీనుండొచ్చావా నాయనా?!
IPL
Zakir...



## ఫోటో ఫీచర్





ప్యూటోరికాలోని మస్కిటో బే బీచ్‌కు సంబంధించిన ఫొటోలివి. ఈ బీచ్ నీలి సముద్రాన్ని తలపిస్తుంది. రాత్రి సమయంలో ఈ సముద్రంలో చేయి పెట్టినా, చిన్న కదలిక అయినా నీళ్లు నీలం రంగు కాంతితో మెరుస్తాయి. ఈ నీటిలో పైరోడినియమ్ బహమెన్స్ అనే సూక్ష్మజీవులు వుండడం వల్ల నీటి రంగు నీలం రంగుతో మెరుస్తుందట. ఈ జీవులు ప్రతి సముద్రంలో వుంటాయిగానీ ప్యూటోరికాలోని మస్కిటో బీచ్‌లో అధికంగా ఉన్నాయట.

